సంపుటి : 9
సంచిక : 308
శుక్రవారం
31 జూలై 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



విశ్వవాయిస్
వార్తా ప్రపంచం ఇప్పుడు మీ చేతుల్లో!
ఈ-పేపర్ కోసం వెంటనే స్కాన్ చేయండి!
వెంటనే స్కాన్ చేయండి!
ఇప్పుడే చదవండి!
Contact For Ads:
7579339999


విశాఖ రైల్వేకు శుభవార్త..

## రూ.299 కోట్లతో కొత్త లైన్లు, ప్లాట్‌ఫారాలు



విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ : విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో పెరుగుతున్న రద్దీకి చెక్ పడనుంది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు రైళ్ల రాకపోకలను మరింత సులభతరం చేసేందుకు భారతీయ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. రూ.299 కోట్లతో విశాఖ కోచింగ్ యార్డు ఆధునికీకరణకు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుతో స్టేషన్ నిర్వహణ మిగతా .. 2లో..

## నిలిచిన పాపికొండల పర్యాటకం



దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ : గోదావరిలో నీటిమట్టం జోరుగా పెరగడంతో పాపికొండలు విహారయాత్రను తాత్కాలికంగా నిలిపివేసినట్లు జలవనరులశాఖ ఏఈ భాస్కర్ తెలిపారు. దీంతో పోలవరం జిల్లా దేవీపట్నం మండలం గండి పోశమ్మ అమ్మవారి ఆలయం నుంచి వెళ్లే 15 ప్రైవేట్ బోట్లు, 1 ఏపీటీడీసీ బోటు సహా మొత్తం 16 బోట్లు గోదావరి ఒడ్డున మిగతా .. 2లో..

## అమరరాజాకు మూడు ప్రతిష్ఠాత్మక అవార్డులు




రేణిగుంట, విశ్వం వాయిస్ న్యూస్ : తిరుపతి జిల్లా అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్‌కు మూడు ప్రతిష్ఠాత్మక అవార్డులు దక్కాయి. గురువారం పీఎంఐ పెర్ల్ సిటీ చాప్టర్ హైదరాబాదులో నిర్వహించిన వార్షిక అవార్డ్స్ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 40కు పైగా ప్రముఖ సంస్థలు పోటీ పడ్డాయి. అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్‌కు పీఎంఓ ఎక్సలెన్స్ అవార్డు, అమరరాజా సర్క్యులర్ సొల్యూషన్స్ చేపట్టిన బ్యాటరీ రీసైక్లింగ్ ప్లాంట్ మిగతా .. 2లో..

# ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల ఎంపిక ఆంధ్రప్రదేశ్

- గత ప్రభుత్వ చర్యలతో పెట్టుబడిదారుల విశ్వాసం కోల్పోయిందని వ్యాఖ్య
- త్వరలో ఆంధ్రప్రదేశ్ నుంచి విదేశాలకు క్లీన్ ఎనర్జీ ఎగుమతులు
- పరిశ్రమలు తేవడం మా బాధ్యత..
- కష్టపడటం యువత బాధ్యత
- టాటా రెన్యువబుల్ ఎనర్జీ శంకుస్థాపన సభలో మంత్రి నారా లోకేష్



అమరావతి, జాతీయ వార్తా ప్రపంచం, జూలై 30 : ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల తొలి ప్రాధాన్యతగా మారిందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. బ్రూక్‌ఫీల్డ్, బ్లాక్‌స్టోన్, బ్లాక్‌రాక్, ఈక్యూటీ, టీపీజీ వంటి ప్రతిష్టాత్మక గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ ఫండ్‌లు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయని, టాటా పవర్, సుజ్లాన్, రెన్యూ, ప్రీమియర్ ఎనర్జీస్, ఏసీఎంఈ, వారీ వంటి ప్రముఖ భారతీయ దిగ్గజ సంస్థల తమ కార్యకలాపాలను ఇక్కడ విస్తరిస్తున్నాయని ఆయన వెల్లడించారు. పత్తికొండ సమీపంలోని హోసూరు వద్ద టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ (టీపీఆర్ఈఎల్) ఆధ్వర్యంలో రూ.5,350 కోట్లతో అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఏర్పాటు చేయనున్న 800 మెగావాట్ల క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు గురువారం మంత్రి లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, గత ఏడాదితో పోలిస్తే ఈ ఒక్క ఏడాదిలోనే ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 400 శాతం పెరిగిందని, రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న విశ్వసనీయత వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు.

**పెట్టుబడిదారుల్లో నమ్మకం పెంపొందించాం**

"రాష్ట్రంలో 2024 జూన్‌లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు, పునరుత్పాదక ఇంధన రంగం పూర్తిగా అస్తవ్యస్తంగా ఉండేది. అంతకుముందు మిగతా .. 2లో..

అప్పలరాజుతో జగన్

# ములాఖత్ రద్దు

- శ్రీకాకుళం అంపోలు జైల్లో రిమాండ్‌లో ఉన్న సీదిరి అప్పలరాజు
- ములాఖత్‌లో కలిసేందుకు వెళ్లిన జగన్
- సాయంత్రం 5 గంటలు దాటడంతో అనుమతి నిరాకరించిన జైలు అధికారులు



శ్రీకాకుళం, విశ్వం వాయిస్ న్యూస్ : రోడ్డు ప్రమాదం కేసులో అరెస్టయి శ్రీకాకుళం అంపోలు జైల్లో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుతో వైసీపీ అధినేత జగన్ ములాఖత్ చివరి నిమిషంలో రద్దయింది. ములాఖత్ కోసం జగన్‌కు జైలు అధికారులు సాయంత్రం 5 గంటల వరకు సమయం ఇచ్చారు. అయితే జైలు వద్దకు జగన్ చేరుకునే సమయానికి నిర్ణీత గడువు ముగిసి పోయింది. సమయం దాటిన తర్వాత కూడా అప్పలరాజును కలిసేందుకు వైసీపీ నేతలు మిగతా .. 2లో..

మోదీ అధ్యక్షతన రక్షణ వ్యవహారాలపై

# క్యాబినెట్ కమిటీ కీలక భేటీ



దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రధాని మోదీ అధ్యక్షతన రక్షణ వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ సమావేశమైంది. ఇరాన్- అమెరికా మధ్య ఉద్రిక్తతలు మరో సారి పతాకస్థాయికి చేరుకున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. ప్రస్తుతం కొనసాగుతున్న అంతర్జాతీయ సంఘర్షణలు, వాటి వల్ల కలిగే భద్రతాపరమైన పరిణామాలు, దేశ ఎగుమతులు, దిగుమతుల్లో ఏర్పడే అంతరాయాలు, విదేశాల్లోని భారతీయ పౌరుల భద్రత, నావికుల రక్షణ గురించి ప్రధానంగా చర్చిం చినట్లు తెలుస్తోంది. భారత్‌కు చమురు రవాణాలో కీలకమైన హర్మూజ్‌లో తీవ్ర ఉద్రిక్తతలు కొనసా గుతున్న తరుణంలో భారత్‌కు సరకు రవాణాలో ఇబ్బందులు ఎదురవ్వకుండా తీసుకుంటున్న చర్యలపై ప్రధాని ఆరా తీసినట్లు సమాచారం. నల్ల సముద్రం, ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఎడెన్ మార్గా లను ప్రత్యామ్నాయంగా మిగతా .. 2లో..

# '2034 వరకు నేనే సీఎం'

- ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ కీలక హామీ
- టీచర్ల సమస్యలు తన బాధ్యతన్న సీఎం
- విద్యార్థుల కోసం పోరాడాలని పిలుపు
- 55 రోజుల్లో 11 వేల మంది టీచర్లను నియమించాం
- ఆర్నెల్లకోసారి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం
- ప్రతి నెల ఒకటో తేదీన జీతాల హామీ



హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : విద్యాశాఖలో సంస్కరణలు చేపడుతున్న ప్రతిసారీ కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తనపై విమర్శలు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అయితే వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత పూర్తిగా తనదేనని స్పష్టం చేశారు. ఇకపై ఉపాధ్యాయ సంఘాలు తమ వ్యక్తిగత సమస్యల కోసం కాకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులకు తాను ఒక్కటే చెబుతున్నానని రేవంత్ అన్నారు. "మీ సమస్యలు నాకు వదిలేయండి. మీరు అడగకముందే మిగతా .. 2లో..

జగన్.. హైవేపై

## 120 కి.మీ. దూరానికి 6 గంటలా?

మంత్రి కొలుసు పార్థసారథి



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : శ్రీకాకుళంలో మహిళా ఎస్సై పట్ల వైకాపా నేతల తీరును మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రంగా ఖండించారు. వైకాపా నేతలు పోలీసులపై దాడి చేసే స్థాయికి వచ్చారన్నారు. రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వ్యక్తి కుటుంబసభ్యులను జగన్ పరామర్శించాల్సింది పోయి.. ఎవరి కోసం వెళ్లారని ప్రశ్నించారు. "జగన్ వెళ్లే మార్గంలోనే భోగాపురంలో ప్రధాని మోదీ పర్యటన ఉంది. ప్రధానికి భద్రత కల్పించే దారిలో ఆందోళనలు చేయకూడదు. భద్రతా కారణాల రీత్యా జగన్ పర్యటనలో ధర్నాలు, మిగతా .. 2లో..

భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని అడ్డుకునేందుకు

## కోర్టుల్లో కేసులు వేశారు

ఉత్తరాంధ్రకు భోగాపురం విమానాశ్రయం మణిహారం లాంటిది
టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు




అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : ఉత్తరాంధ్ర అభివృద్ధికి అత్యంత కీలకమైన భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఆగస్టు 1న ప్రధాని మోదీ చేతుల మీదుగా వైభవంగా ప్రారంభం కానుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఈ విమానాశ్రయం ఒక మణిహారం లాంటిదని, దీని రాకతో రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో భారీగా పెట్టుబడులు వస్తాయని పల్లా హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కోర్టులలో కేసులు వేసిన వారే... మిగతా .. 2లో..

అప్పలరాజును కలవాలన్న ఆలోచన

## జగన్‌కు లేదు

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : శ్రీకాకుళంలో మహిళా ఎస్సైపై వైకాపా నేతల దాడిని మహిళా లోకం ఖండించాలని రాష్ట్ర హోంమంత్రి అనిత అన్నారు. విధుల్లో ఉన్న మహిళా ఎస్సైపై జుగుప్సాకరంగా ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల పట్ల గొడ్డలి పార్టీ నేతల తీరు మారాలన్నారు. వైకాపా నేత సీదిరి అప్పలరాజుతో ములాఖత్‌కు సమయానికి వెళ్లకుండా జగన్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. "సీదిరి అప్పలరాజును కలవాలనుకుంటే ములాఖత్ మిగతా .. 2లో..




ఇ-20 పెట్రోల్‌తో

## మైలేజీ తగ్గుతుంది.. కానీ

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



విశ్వం వాయిస్ న్యూస్ : 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడకంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇ-20 పెట్రోల్ వాడకం వల్ల మైలేజీ 2 నుంచి 6 శాతం మేర తగ్గుతుందన్నారు. వాహన రకం, అది ఏ సంవత్సరంలో తయారైంది? అనే దానిపై ఆధారపడి ఉంటుందన్నారు. ఈ మేరకు పార్లమెంట్‌లో ఓ ఎంపీ అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఇ-20 వాడకం వల్ల వాహనంలో గానీ, ఇంజిన్‌లో గానీ ఇప్పటివరకు ఎలాంటి సమస్యలు తలెత్తలేదని గడ్కరీ అన్నారు. ఇ-10 ఇంధనంతో పోలిస్తే ఇ-20 పెట్రోల్ 30 శాతం కర్బన ఉద్గారాలను మిగతా .. 2లో..

ఎయిరిండియా ఐకానిక్ భవనం..


## ఇక సీఎం ఆఫీసుగా..




విశ్వం వాయిస్ న్యూస్ : దేశ వాణిజ్య రాజధాని ముంబయిలోని ఎయిరిండియా ఐకానిక్ భవనం ఇకపై కొత్త చిరునామాకు వేదిక కానుంది. నారిమన్ పాయింట్‌లోని ఈ ప్రఖ్యాత కట్టడం మరికొద్ది రోజుల్లో సీఎం ఆఫీసుగా మారనుంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తన కార్యాలయాన్ని రాష్ట్ర సచివాల యమైన మంత్రాలయ నుంచి ఈ భవనానికి మార్చుకోనున్నారు. అరేబియా సముద్రానికి సమీపంలో ఉన్న ఈ 23 అంతస్తుల కమర్షియల్ టవర్‌ను 1974లో ప్రభుత్వ స్థలంలో నిర్మించారు. అప్పట్లో ఇందులోని ఎలివేటర్లు, ఇతరత్రా హంగులను చూసేందుకు ప్రజలు ఇక్కడకు వచ్చేవారు. ఎయిరిండియా ప్రైవేటీకరణ తర్వాత.. ఈ భవనంతో పాటు దాని అనుబంధ మిగతా .. 2లో..

## పాదయాత్రను వాయిదా వేస్తున్నా

మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు



గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ : తన నివాసంపై జరిగిన దాడికి సంబంధించి నిందితులపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తూ తలపెట్టిన 'వినతి యాత్ర' మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# ఇప్పుడు గ్లోబల్ ఇన్వెస్టర్ల ఎంపిక

ఐదేళ్లలో కనీసం ఒక్క మెగావాట్ సామర్థ్యం గల ప్రధాన రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు కూడా ప్రారంభించలేదు. విద్యుత్ కొనుగోలు ఒప్పం దాలను ఏకపక్షంగా రద్దు చేశారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం దెబ్బతింది. ప్రపంచంలోని అనేక అతిపెద్ద ఇన్‌ఫ్రా, క్లైమెట్ ఫండ్స్ ఆంధ్రప్రదేశ్‌ను బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాయి. ఒకసారి దెబ్బతిన్న విశ్వాసాన్ని పునరుద్ధరించడం రాత్రికి రాత్రే సాధ్యంకాదు. పెట్టుబడిదారుల్లో మళ్లీ నమ్మకాన్ని పెంపొందిస్తూ వచ్చాం" అని పేర్కొన్నారు.

### ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీతో తొలిఅడుగు

ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ – 2024ను ప్రవేశపెట్టి విస్తృతమైన విజన్‌తో 160 గిగావాట్ల క్లీన్ ఎనర్జీ సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని అన్నారు. సోలార్ మాడ్యూల్స్, సెల్స్ నుండి బ్యాటరీలు, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, ట్రాన్స్ మిషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, పోర్ట్స్, స్టోరేజీ సిస్టమ్స్.. ప్రపంచ స్థాయి తయారీ వరకు – మొత్తం క్లీన్ ఎనర్జీ సప్లయ్ చైన్ ను ఆంధ్రప్రదేశ్ లో నిర్మించాలని అనుకున్నామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛ ఇంధనాన్ని వినియోగించుకోవడమే కాకుండా, క్లీన్ ఎనర్జీ టెక్నాలజీలకు గ్లోబల్ ప్రొడ్యూసర్ గా మారాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని లోకేష్ తెలిపారు.

### టాటా రెన్యువబుల్ ప్రాజెక్ట్.. మా విజన్‌కు నిదర్శనం

"టాటా రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ రూ. 5,750 కోట్ల పెట్టుబడితో, పత్తికొండలో 400 మెగావాట్ల సౌర విద్యుత్‌ను, అనంతపురం జిల్లా కనేకల్లులో 400 మెగావాట్ల పవన విద్యుత్‌తో కలిపి, 800 మెగావాట్ల హైబ్రిడ్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టుగా అవతరించబోతోంది. ఈ ఒక్క ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో దాదాపు 4,000 ఉద్యోగాలను కల్పిస్తుంది. 3,400 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో గల ఈ ప్రాజెక్టు ద్వారా 1,100 పైగా రైతు కుటుంబాలకు దాదాపు మూడు దశాబ్దాల పాటు స్థిరమైన కౌలు ఆదాయాన్ని అందిస్తుంది. ఈ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్‌పైనా, మా పరిపాలనపైనా విశ్వాసానికి ప్రతీక.

### టాటా గ్రూప్‌తో మాకు ప్రత్యేకమైన అనుబంధం

టాటా గ్రూప్‌తో మాకు దశాబ్దాల తరబడి అనుబంధం ఉంది. 1990లో నా తండ్రి చంద్రబాబు నాయుడు గారు హైదరాబాద్‌లో 'హైటెక్ సిటీ'ని నిర్మిస్తున్నప్పుడు, ఆయన దార్శనికతను నమ్మిన మొట్టమొదటి సంస్థలలో టిసిఎస్ ఒకటి. ఆ నమ్మకంతో కూడిన అనుబంధం నేటికీ కొనసాగుతోంది. 2024లో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, నేను టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్‌ను కలిసి ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించడానికి ఆంధ్రప్రదేశ్ భిన్నంగా ఏమి చేయాలి అని అడిగాను. "వేగంపై దృష్టి పెట్టండి. పెట్టుబడిదారులకు ప్రోత్సాహకాల కంటే జాప్యం వల్ల కలిగే నష్టమే ఎక్కువ," అని ఆయన చెప్పారు. మా ప్రభుత్వ విధానం కూడా సింపుల్, స్పీడ్, స్టెబిలిటీలో భాగం అయ్యింది. శంకుస్థాపన నుండి ప్రారంభోత్సవం వరకు ప్రభుత్వం మద్దతుగా నిలబడుతుందనే విశ్వాసం మేము పెట్టుబడిదారులకు కల్పిస్తున్నాం" అని అన్నారు.

### స్వచ్ఛ ఇంధనం ఎగుమతి చేస్తాం

"భారతదేశంలోనే అత్యంత పొడవైన తీరప్రాంతం, సమృద్ధిగా పునరుత్పాదక వనరులు, ప్రపంచ స్థాయి ఓడరేవులు ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఎగుమతులకు భారతదేశపు ముఖద్వారంగా మారడానికి మాకు అవకాశం కల్పిస్తున్నాయి. అతి త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పత్తి అయ్యే స్వచ్ఛమైన ఇంధనాన్ని తీసుకువెళ్లే ఓడలు యూరప్, జపాన్, కొరియా, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు ప్రయాణిస్తాయి. క్లీన్ మాలిక్యులస్, గ్రీన్ ఫ్యూయల్స్, సాంకేతికతలను ఎగుమతులూ ఏపీ నుంచి చేసే స్థాయికి చేరతాం.

### సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కలిసి పనిచేయాలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఐఐటి తిరుపతి, యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ (ఆస్ట్రేలియా) సహకారంతో సోలార్ మ్యానుఫ్యాక్చరింగ్, రెన్యువబుల్ ఎనర్జీ టెక్నాలజీల కోసం ఏర్పాటు చేస్తున్న ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కలిసి పనిచేయాలని టాటా పవర్‌ను ఆహ్వానిస్తున్నాం. మనం కలిస్తే భారతదేశపు స్వచ్ఛ ఇంధన భవిష్యత్తును నిర్మించే ఇంజనీర్లు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, పారిశ్రామికవేత్తలను తయారు చేయగలం. టాటా రెన్యువబుల్ ఎనర్జీ కార్యరూపం దాల్చడానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నాను.

### సుజ్లాన్‌కు ప్రత్యేక అభినందనలు

దశాబ్దాలుగా, భారతదేశ పవన శక్తి రంగంలో సుజ్లాన్ అగ్రగామి పాత్ర పోషిస్తున్న సుజ్లాన్ పవన శక్తి ప్రాజెక్ట్ అభివృద్ధిలో భాగం కావడం ఆంధ్రప్రదేశ్ పునరుత్పాదక ఇంధన లక్ష్యాలకు గొప్ప బలాన్ని చేకూరుస్తుంది. ఈ ప్రాజెక్ట్ కోసం అవసరమైన విండ్ టర్బైన్‌లను అనంతపురంలోనే సుజ్లాన్ ఏర్పాటు చేసిన కేంద్రంలో తయారు కావడం ఏపీలో సమగ్ర పారిశ్రామిక వ్యవస్థ అభివృద్ధికి మరో నిదర్శనం. విండ్ టర్బైన్‌ల తయారీ, నిర్వహణలో యువతకు నైపుణ్య శిక్షణనిచ్చే కేంద్రాలను కూడా ఏర్పాటుచేసి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానంలో దీర్ఘకాలిక భాగస్వామిగా నిలిచినందుకు సుజ్లాన్ యాజమాన్యం, బృందానికి కృతజ్ఞతలు.

### వజ్రాల నేల..బంగారం లాంటి ప్రజలు

అశోకుడు పాలించిన గొప్ప నేల పత్తికొండ. పత్తికొండలో యువశక్తి అదిరిపోయింది. బంగారు గనులు ఉన్న ప్రాంతం ఇది, బంగారం లాంటి ప్రజలు ఉన్న నేల ఇది. జొన్నగిరి గోల్డ్ ఇప్పుడు ఏపీకే బ్రాండ్. పత్తికొండ బంగారం గురించి ఇప్పుడు ప్రపంచం మొత్తం మాట్లాడుతుంది. ఈ నేలలో వజ్రాలు దొరుకుతాయి, వజ్రాల లాంటి యువకులు ఇక్కడ ఉన్నారు. పెరవలి రంగనాథ స్వామి ఆలయం, పత్తికొండ సాయిబాబా ఆలయం ఉన్న పుణ్య భూమి పత్తికొండ" అని మంత్రి పేర్కొన్నారు.

### కర్నూలు ప్రజల అభిమానం మరువలేను

"ఉమ్మడి కర్నూలు జిల్లా అంటే నాకు ఇష్టం. నేను పాదయాత్రలో వచ్చినప్పుడు ప్రజలు చూపిన ప్రేమ ఎప్పటికి మర్చిపోలేను. నేను 45 రోజులు, 14 నియోజక వర్గాల్లో పాదయాత్ర చేసాను. నాకు కర్నూలు జిల్లా ప్రజల సమస్యలు తెలుసు, కష్టాలు, వలసలు నేను చూశాను. నేను పత్తికొండ వచ్చినప్పుడు అప్పటి ప్రభుత్వం నన్ను అడ్డుకోవడానికి 1000 మంది పోలీసులను పంపింది. పత్తికొండ ప్రజలు నాకు మద్దతుగా నిలిచారు. అందుకే మీ రుణం తీర్చుకుంటున్నా. ఉమ్మడి కర్నూలు జిల్లా అభివృద్ధిని బాధ్యతగా తీసుకున్నా. గౌరవ ముఖ్యమంత్రి గారు, నేను, మంత్రి టిజి భరత్ ప్రపంచం మొత్తం తిరిగి రాష్ట్రానికి అనేక కంపెనీలు తీసుకొస్తున్నాం. కర్నూలు జిల్లాకు కూడా అనేక పరిశ్రమలు రాబోతున్నాయి. పరిశ్రమలు తీసుకురావం మా బాధ్యత. కానీ కష్టపడి పనిచేయాల్సిన బాధ్యత యువకులపై ఉంది. కష్టం, ప్రతిభ రెండూ ఉండాలి. అప్పుడే కంపెనీలకు నమ్మకం వస్తుంది" అని అన్నారు.

### ఇండస్ట్రీ కనెక్ట్ తో నైపుణ్యాభివృద్ధి

"నాకు ఒక వింత పరిస్థితి ఎదురవుతోంది. మేము కంపెనీ పెట్టడానికి సిద్ధంగా ఉన్నాం, మీ దగ్గర స్కిల్ ఉన్న యూత్ ఉన్నారా అని కొంతమంది పారిశ్రామికవేత్తలు అడుగుతున్నారు. అందుకే ఇప్పుడు ఐటిఐలని ఇండస్ట్రీతో కనెక్ట్ చేస్తున్నాం. ఒక్కో ఐటీఐని ఒక్కో కంపెనీకి అటాచ్ చేస్తున్నాం. ఇండస్ట్రీకి కావాల్సిన విధంగా యూత్ ని సిద్ధం చేస్తున్నాం. మొన్నే శ్రీసిటీలో యూనివర్సిటీని ప్రారంభించాను. ఇది ఇండియాలోనే నేర్చుకోండి – సంపాదించండి – గ్రాడ్యుయేట్ అవ్వండి మోడల్‌లో నిర్వహించే తొలి యూనివర్సిటీ. మూడు నెలలు క్లాస్ రూములో, 8 నెలలు ఇండస్ట్రీ లో వర్క్ చదువుకుంటూనే సంపాదిస్తారు. చదువు పూర్తయ్యేసరికి ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యాలు సంపాదిస్తారు" అని లోకేష్ వ్యాఖ్యానించారు.

### దేశానికి నాయకత్వం వహించే ఏపీని నిర్మిద్దాం

'టాటా' అనే పేరు ఎల్లప్పుడూ నమ్మకం, నిజాయితీ, దేశ నిర్మాణం, ఆవిష్కరణలకు మారుపేరుగా నిలిచిందని లోకేష్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో టాటా బంధం చాలా బలీయమైనదని అన్నారు. ప్రభుత్వం, పారిశ్రామిక రంగం, రైతులు, ప్రజలు కలిసి క్లీన్ ఎనర్జీ, పరస్పర విశ్వాసం, భాగస్వామ్య స్ఫూర్తితో కూడిన సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తున్నామని అన్నారు. భారతదేశానికి దిశానిర్దేశం చేసే ఆంధ్రప్రదేశ్‌ను, స్వచ్ఛ ఇంధన రంగంలో ప్రపంచానికే నాయకత్వం వహించే భారతదేశాన్ని మనం కలిసి నిర్మిద్దామని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టాటా పవర్ సిఇఓ & ఎండి ప్రవీర్ సిన్హా, టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీ సిఇఓ & ఎండి సంజయ్ బంగా, సుజలాన్ వైస్ చైర్మన్ గిరీష్ తంతి, భారీ పరిశ్రమల మంత్రి టిజి భరత్, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, కె.ఇ. శ్యామ్ బాబు, జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి, టాటా పవర్, సుజ్లాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# క్యాబినెట్ కమిటీ కీలక భేటీ

ఉపయోగించుకోవడంపైనా చర్చించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. పెట్రోలియం, సహజవాయువు, ఎరువులు తదితరాల దిగుమతికి తీసుకుంటున్న చర్యలపై ఆయా శాఖలు ప్రజెంటేషన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులు కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. ఈ భేటీలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగశాఖ మంత్రి జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా, వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్, నౌకాయాన శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్, పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి పాల్గొన్నారు.

# '2034 వరకు నేనే సీఎం'

వాటిని పరిష్కరిస్తాను. ప్రమోషన్లు, బదిలీలు కూడా మీ ఇంటి వద్దకే పంపించాం. ఇకపై మీకోసం కాదు.. విద్యార్థుల సమస్యల కోసం నాతో కొట్లాడండి" అని సూచించారు. విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని కోరారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని వ్యాఖ్యానించిన రేవంత్ రెడ్డి, ఆ లోపు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పూర్తి బాధ్యత వహిస్తానన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కేవలం 55 రోజుల్లో 11 వేల మంది ఉపాధ్యాయులను నియమించామని గుర్తు చేశారు. ఇలాంటి నియామకాలు గతంలో ఎప్పుడైనా జరిగాయా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం ఉపాధ్యాయులదేనని, అందుకే వారి సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రాబోయే ఐదేళ్లలో తెలంగాణ విద్యాశాఖను ప్రపంచ దేశాలు ఆదర్శంగా చూసే స్థాయికి తీసుకెళ్లాలని రేవంత్ పిలుపునిచ్చారు. పంచవర్ష ప్రణాళిక తరహాలో ఉపాధ్యాయ సంఘాలు ప్రతిజ్ఞ చేసి పని చేయాలని కోరారు. అలాంటి కృషి చేస్తే విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని అన్నారు. దేశానికి విద్య, వైద్య రంగాల్లో తెలంగాణే నాయకత్వం ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించారు. ఇకపై ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయ సంఘాల నాయకులతో నేరుగా చర్చిస్తానని సీఎం హామీ ఇచ్చారు. వారి సమస్యల పరిష్కారానికి క్రమం తప్పకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో ఒకటో తేదీన ఉద్యోగుల జీతాలు సమయానికి పడేవి కాదని, ఇప్పుడు మాత్రం అడగకుండానే ప్రతి నెల ఒకటో తారీఖున జీతాలు జమ చేస్తున్నామని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా అదే రోజు వేతనాలు చెల్లిస్తున్నామని వెల్లడించారు.

జగన్.. హైవేపై

# 120 కి.మీ. దూరానికి 6 గంటలా?

ర్యాలీలు, సభలకు అనుమతి లేదు. భయపెట్టి అధికారంలోకి వచ్చేందుకు జగన్ యత్నిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు తావులేదు. రెండేళ్లుగా ఆయన పర్యటనలను చూస్తున్నాం. భయానక వాతావరణం కల్పించడమే జగన్ లక్ష్యం. ప్రధాని మోదీ పర్యటనను పక్కదారి పట్టించడమే ఆయన ఉద్దేశం. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం హైవేపై 120 కి.మీ. దూరం వెళ్లేందుకు 6 గంటలు అవసరమా?" అని పార్థసారథి ప్రశ్నించారు.

### మహిళలంటే వైకాపా నేతలకు ఎప్పుడూ గౌరవం లేదు: మంత్రి సంధ్యారాణి

మహిళలంటే వైకాపా నేతలకు ఎప్పుడూ గౌరవం లేదని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఎవరైనా బాధితులను పరామర్శిస్తారని.. జగన్ మాత్రం నిందితుల వద్దకు వెళ్లారని విమర్శించారు. జగన్ ఎప్పుడూ నేరగాళ్లనే సమర్థిస్తారన్నారు. పోలీసులు, కోర్టులను వైకాపా నేతలు ఎప్పుడూ పట్టించుకోలేదని ఆమె విమర్శించారు.

# మైలేజీ తగ్గుతుంది.. కానీ

తగ్గిస్తుందన్నారు. అంతేకాకుండా యాక్సిలరేషన్ మెరుగవుతుందన్నారు. బీఎస్–III, బీఎస్–IV, బీఎస్ –VI ఈ10 (గ్యాసోలిన్) టూ వీలర్, ఫోర్ వీలర్ వాహనాల్లో ఇ20 పెట్రోల్ వాడకాన్ని అంచనా వేయడానికి ARAI, SIAM, IOC సంయుక్తంగా ఓ అధ్యయనం జరిపాయన్నారు. వాహన నిర్వహణ ఖర్చులు పెరుగుతాయని, ఇంధన సామర్థ్యం తగ్గుతుందంటూ వస్తున్న విమర్శలను తోసిపుచ్చారు. ఇథనాల్ బ్లెండెడ్ ప్రోగ్రామ్ 2001లోనే పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభమైందని మంత్రి గుర్తు చేశారు. 2006లో ఇ5 (ఇథనాల్ 5 శాతం) తీసుకురాగా.. ఉత్పత్తి సామర్థ్యం మేరకు క్రమక్రమంగా పెంచుకుంటూ వచ్చినట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఇ20 ఇథనాల్‌తో నడుస్తున్నాయని, ఆ వాహనాల్లో ఇప్పటివరకు ఎలాంటి సమస్యా తలెత్తలేదని మరోసారి స్పష్టం చేశారు.

# ఇక సీఎం ఆఫీసుగా..

ఆస్తులన్నీ టాటా గ్రూప్‌నకు చెందిన ఎయిరిండియా అసెట్స్ హోల్డింగ్ లిమిటెడ్‌కు అప్పగించారు. మరోవైపు, 1955లో నిర్మించిన రాష్ట్ర సచివాలయం మంత్రాలయలో స్థలాభావం ఏర్పడింది. ఈ ప్రాంగణంలో ప్రభుత్వ విభాగాలకు చెందిన ఆఫీసులకు స్థలం సరిపోకపోవడంతో.. చుట్టుపక్కల ఉన్న దాదాపు 9లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్‌ను మహా సర్కారు అద్దెకు తీసుకుంది. దీని కోసం ఏటా రూ.200 కోట్ల మేర అద్దె చెల్లిస్తోంది. ఈ భారాన్ని తగ్గించుకునేందుకు చర్యలు చేపట్టిన ఫడణవీస్ ప్రభుత్వం.. జూన్‌లో నారిమన్ పాయింట్‌లో ఉన్న ఎయిరిండియా భవనాన్ని రూ.1,601 కోట్లతో కొనుగోలు చేసింది. ఇప్పుడు ఆ భవనంలోకి సీఎం కార్యాలయంతో పాటు అద్దె భవనాల్లో నిర్వహిస్తోన్న అన్ని ప్రభుత్వ విభాగాలను మార్చేందుకు సిద్ధమైంది. ఈ ఎయిరిండియా భవనంలో అన్నింటి కంటే పైనున్న 23వ అంతస్తులో సీఎం కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇక, 22వ అంతస్తులో క్యాబినెట్ హాల్ ఉండనుంది. కింది అంతస్తులను ఇతర విభాగాలను కేటాయించనున్నారు. ఈ ప్రణాళికకు సంబంధించి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో గురువారం కీలక సమీక్ష జరగనుంది. అనంతరం భవనంలో నిర్మాణపరమైన ఆడిట్ చేపట్టి అవసరమైన మరమ్మతులు చేయనున్నారు. అవన్నీ పూర్తయిన తర్వాత తరలింపు ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం.

# పాదయాత్రను వాయిదా వేస్తున్నా

పాదయాత్రను మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు తాత్కాలికంగా వాయిదా వేశారు. గుంటూరులోని తన నివాసంలో పార్టీ నేతలతో అత్యవసరంగా సమావేశమైన అనంతరం ఆయన ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. త్వరలోనే పాదయాత్రకు సంబంధించి కొత్త తేదీని ప్రకటిస్తానని తెలిపారు. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం... ఆగస్టు 7, 8 తేదీల్లో గుంటూరులోని తన నివాసం నుంచి మంగళగిరిలోని డీజీపీ కార్యాలయం వరకు రెండు రోజుల పాటు ఈ నిరసన పాదయాత్ర చేపట్టాల్సి ఉంది. అయితే, రాష్ట్రంలో డీఎస్సీ నిర్వహణలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై వైసీపీ అదే సమయంలో రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. పార్టీ అధిష్ఠానం చేపడుతున్న ముఖ్యమైన నిరసన కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ, తన సొంత పాదయాత్రను వాయిదా వేస్తున్నట్లు అంబటి స్పష్టం చేశారు.

# రూ.299 కోట్లతో కొత్త లైన్లు, ప్లాట్‌ఫారాలు

సామర్థ్యం పెరగడంతో పాటు రైళ్ల ఆలస్యం తగ్గే అవకాశం ఉంది. దక్షిణ కోస్ట్ రైల్వే పరిధిలోని విశాఖపట్నం కోచింగ్ యార్డును పూర్తిగా పునర్వ్యవస్థీకరించనున్నారు. ఇందులో ఆరు కొత్త లైన్లు, అదనపు ప్లాట్‌ఫారాలు నిర్మించనున్నారు. ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఉన్న ఆరు ప్లాట్‌ఫారాలను కూడా విస్తరించనున్నారు. దీంతో యార్డులో రద్దీ తగ్గి రైళ్ల కదలిక మరింత వేగంగా సాగనుంది. ప్రస్తుతం విశాఖ రైల్వే స్టేషన్ నుంచి రోజూ సుమారు 80 వేల మంది ప్రయాణిస్తున్నారు. సగటున 113 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుత యార్డు నిర్మాణం కారణంగా టెర్మినేటింగ్ రైళ్లు, ఇతర రైళ్లు ఒకే మార్గాలను దాటాల్సి వస్తోంది. దీనివల్ల అప్రోచ్ సిగ్నళ్ల వద్ద రైళ్లు నిలిచిపోవడం, ప్లాట్‌ఫారాల లభ్యత తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. కొత్త ప్రాజెక్టు పూర్తైతే ఈ సమస్యలు గణనీయంగా తగ్గనున్నాయి. రైళ్ల నిలిపివేత సమయం తగ్గుతుంది. ప్లాట్‌ఫారాల వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. భవిష్యత్తులో మరిన్ని రైళ్లను నిర్వహించే వీలుంటుంది. తూర్పు వైపు కొత్త ప్రవేశ ద్వారం నిర్మించడంతో పాటు ప్రయాణికుల రిజర్వేషన్ కేంద్రాన్ని కూడా కొత్త ప్రదేశానికి తరలించనున్నారు.

# నిలిచిన పాపికొండల పర్యాటకం

నిలిపివేశారు. ఎగువ గోదావరి పరివాహక ప్రాంతాల నుంచి వరద నీరు రావడంతో బోటు నిర్వాహకులు అప్రమత్తమయ్యారు. ఈదురుగాలులు, వర్షాలకు పర్యాటక బోట్లు వెళ్లకుండా తాళ్లతో కట్టి ఒడ్డుకు చేర్చారు.

# అమరరాజాకు మూడు ప్రతిష్ఠాత్మక అవార్డులు

ప్రాజెక్టుకు ప్రాజెక్టు ఆఫ్ ది ఇయర్ అవార్డ్‌తో పాటు సస్టైనబిలిటీ ప్రాజెక్టు ఎక్సలెన్స్ అవార్డులు దక్కాయి. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ గల్లా జయదేవ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గౌరినేని హర్షవర్ధన్ మాట్లాడుతూ సంస్థ విజయానికి ఉద్యోగుల అంకిత భావం, సమష్టి కృషి, అత్యుత్తమ పనితీరు ప్రధాన కారణమన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని వినూత్న ప్రాజెక్టులను విజయవంతంగా అమలు చేస్తూ పరిశ్రమలో కొత్త ప్రమాణాలను నెలకొల్పాలని ఆకాంక్షించారు.

# అప్పలరాజుతో జగన్ ములాఖత్ రద్దు

అనుమతి కోరగా, జైలర్ ఉన్నతాధికారులతో సంప్రదించారు. జైలు నిబంధనల ప్రకారమే నడుచుకోవాలని, సాయంత్రం 5 గంటల దాటిన తర్వాత ఎలాంటి ములాఖత్‌కు అనుమతి లేదని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. జైలు నిబంధనల దృష్ట్యా అధికారుల నుంచి అనుమతి లభించకపోవడంతో జగన్, సీదిరి అప్పలరాజుల ములాఖత్ రద్దయింది. అనంతరం జైలు ప్రాంగణం వద్దే వేచి ఉన్న అప్పలరాజు కుటుంబ సభ్యులను జగన్ కలిసి పరామర్శించారు.

# కోర్టుల్లో కేసులు వేశారు

ఇప్పుడు క్రెడిట్ చోరీకి పాల్పడుతూ ఇది తమ ఘనత అని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. "గతంలో 'ఎర్ర బస్సు సరిగ్గా రాని చోట ఎయిర్‌పోర్ట్ ఎందుకు?' అని ప్రశ్నించిన జగన్, ఇప్పుడు తానే నిర్మించినట్లు భ్రమల్లో బతుకుతున్నారు" అని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌కు నిదర్శనమే ఈ విమానాశ్రయమని... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మిగిలిన పనులన్నింటినీ శరవేగంగా పూర్తి చేసి రికార్డు సమయంలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేసిందని తెలిపారు. టీడీపీ హయాంలోనే శంకుస్థాపన జరిగి, ఇప్పుడు తమ హయాంలోనే ప్రారంభమవుతోందని చెబుతూ... అసలు ఐదేళ్ల పాలనలో వైసీపీ ఈ ప్రాజెక్టు కోసం ఏం చేసిందో సమాధానం చెప్పాలని పల్లా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

# జగన్‌కు లేదు

సమయానికే జగన్ వెళ్లాలి. సమయానికి వెళ్లకుండా రాజకీయాలు చేస్తున్నారు. నిజానికి అప్పలరాజును కలవాలన్న ఆలోచన జగన్‌కు లేదు. ములాఖత్‌కు మధ్యాహ్నం 2–3 గంటల మధ్య అధికారులు సమయం ఇచ్చారు. సాయంత్రం 5 తర్వాత జగన్ వెళ్తే అర్థమేంటి? కేవలం బలప్రదర్శన ఆలోచనే ఆయనకు ఉంది. మహిళా ఎస్సై పట్ల సొంత పార్టీ నేతలు ప్రవర్తించిన తీరుకు జగన్ క్షమాపణ చెప్పాలి" అని అనిత డిమాండ్ చేశారు.

## మహిళా రక్షణ, ఫోక్స్ చట్టాలపై యువతకు మేలుకొల్పు

### ఈస్ట్ జోన్ డీఎస్పీ బి.విద్య



**మండపేట మండలం, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ద్వారపూడి గ్రామంలోని బాలమణికంఠ జూనియర్ కళాశాల & పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూర్పు జోన్ డీఎస్పీ బి విద్య, మండపేట రూరల్ సీఐ పి దొరరాజు, ఎస్ఐ వి కిషోర్ పాల్గొని మాట్లాడారు. పోక్సో చట్టం, మహిళలు-బాలికలపై నేరాల నివారణ, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల గురించి విద్యార్థులకు వివరించారు. మహిళలను గౌరవించాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వాడాలని సూచించారు. ఓ పి టి, పాస్‌వర్డ్, బ్యాంక్ వివరాలు ఎవరికీ చెప్పొద్దని, అపరిచితులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని తెలిపారు. సమస్య వస్తే వెంటనే 112 లేదా సైబర్ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, స్టాఫ్ పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## జగన్ తర్వాత ఆమె.. నంబర్ టూ పోస్టులోకి?

వైసీపీలో సర్వ సత్తాక అధినేత జగన్ అన్నది అందరికీ తెలుసు. పార్టీ ఆయనతోనే అల్లుకుని ఉంది. జగన్ ఇమేజ్ తోనే పార్టీకి విజయం అయినా లేదా మరేదైనా. అన్నింటికీ ఆయనే కర్త కర్మ క్రియ అన్నది తెలిసిందే. ఇదిలా ఉంటే ఒంటి చేత్తో జగన్ పార్టీని దాదాపుగా పదిహేనేళ్ళ పాటు నెట్టుకుని వచ్చారు. అయితే ఇపుడు పరిస్థితులు మారు తున్నాయి. దాంతో జగన్ పార్టీలో నంబర్ టూ అవసరం ఏర్పడింది అని అంటున్నారు. గతంలో విజయసాయిరెడ్డి ఈ పోస్టులో ఉండేవారు అని అనుకునేవారు. అయితే ఆయన రెండేళ్ళ క్రితం పార్టీని వీడి వెళ్ళిపోయారు. ప్రస్తుతం సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీలో జగన్ తరువాత కీలకంగా వ్యవహరిస్తున్నారు అని అనుకున్నా అది కూడా సరిపోవడం లేదు, కోటరీ జగన్ చుట్టూ ఉందని ఒక ప్రచారం అయితే ఉంది. దాంతో చాలా మంది అసంతృప్తి చెందుతున్నారు. దాంతో జగన్ సరికొత్తగా ఆలోచన చేస్తున్నారు అని అంటున్నారు.

### అన్ని విధాలుగా అండగా

ప్రస్తుతం ఏపీలోని టీడీపీలో చంద్రబాబుకు లోకేష్ అందుకుని వచ్చారు. ఆయన పార్టీ వ్యవహారాలను చక్కబెడుతున్నారు. అలాగే జనసేనలో పవన్ కి నాగబాబు అండగా ఉన్నారు. అలాగే వైసీపీకి కూడా సంబంధీకులు వెన్నుదన్నుగా ఉంటే ఏ ఇబ్బంది ఉండదు, పైగా ఎలాంటి కోటరీ విమర్శలు రాకపోతే నాయకత్వం అంతా ఒక్కటిగా ఉంటుందని భావిస్తున్నారుట. దాంతో పాటుగా జగన్ వచ్చే ఏడాది నుంచి జనంలోనే ఉండబోతున్నారు. ఆయన పర్యటనలు పాదయాత్ర అన్నీ కలిపి 2029 ఎన్నికల దాకా కొనసాగుతాయని అంటున్నారు. దాంతో పార్టీ వ్యవహారాలను చక్కబెట్టడానికి నంబర్ టూ ఒకరు అవసరం అని భావిస్తున్నారుట. ఆ పదవిలోకి ఎవరు వస్తారు అన్నదే చర్చగా ఉంది. కానీ దానికి ఇటీవల కాలంలో జరుగుతున్న ప్రచారం అయితే ఆసక్తికరంగానే ఉంది అని అంటున్నారు.

### రంగంలోకి ఆమె

జగన్ తరువాత వైసీపీ మొత్తం బాధ్యతలు చూసే చాన్స్ ఆమెకే అని అంటున్నారు. ఆమె ఎవరో కాదు జగన్ సతీమణి భారతి అని చెబుతున్నారు. వైసీపీలో అందరినీ కట్టుగా జట్టుగా ఉంచడంతో భారతి వంటి వారు అయితేనే సరిపోతారు అని భావిస్తున్నారుట. పైగా ఏ రకమైన ఇబ్బందులు కూడా ఆమెకు ఈ బాధ్యతలు అప్పగిస్తే రావు అని అంటున్నారు. అదే వేరొకరికి తెచ్చి అక్కడ పెడితే పార్టీలో ఇతర నేతల మధ్య విభేదాలు రావడం జరుగుతుందని కూడా అంటున్నారు. ఇక జగన్ కూడా పార్టీ బాధ్యతలు తన సతీమణికి పంచాలని చూస్తున్నారు అని వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే జగన్ కి సంబంధించిన వ్యాపారాలు వ్యవహారాలు అన్నీ కూడా భారతి చూస్తున్నారు. ఆమె రాజకీయంగా పెద్దగా కనిపించినది లేదు, ఎన్నికల వేళ మాత్రం ఆమె పులివెందులలో జగన్ తరఫున ప్రచారం చేస్తున్నారు. ఇపుడు ఆమెకి వైసీపీలో కీలక పగ్గాలు అప్పగించాలని జగన్ ఆలోచిస్తున్నారు అని అంటున్నారు.

### కడప నుంచి ఎంపీగా

అంతే కాకుండా వచ్చే ఎన్నికల్లో కడప లోక్ సభ సీటు నుంచి కూడా భారతిని పోటీ చేయించాలని జగన్ ఆలోచిస్తున్నారు అని కూడా వినిపిస్తోంది. ఇక్కడ ఎంపీగా అవినాష్ రెడ్డి ఉన్నారు. ఆయన 2024 నుంచి వరసగా మూడు సార్లు గెలుస్తూ వచ్చారు. ఇక 2029లో భారతిని పోటీ చేయించడం ద్వారా మొత్తం ఈ ఎంపీ సీటు పరిధిలో పది అసెంబ్లీ సీట్లను గెలుచుకోవచ్చు అన్నది జగన్ ప్లాన్ గా ఉంది అని అంటున్నారు. అంతే కాదు జాతీయ రాజకీయాల్లో కూడా ఢిల్లీ స్థాయిలో వైసీపీ పాత్ర వచ్చే ఎన్నికల్లో పెరుగుతుందని భావిస్తున్న క్రమంలో భారతిని పోటీ చేయిస్తారు అని గట్టిగా వినిపిస్తోంది. చూడాలి మరి ఇవి ఊహాగానాలుగా మిగులుతాయా లేదా నిజం అవుతాయా అన్నది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

### కరీంనగర్ దోపిడీ కేసులో

## అల్లుడు, మనవడే సూత్రధారులు

### ముగ్గురి అరెస్టు



**కరీంనగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** సంచలనం సృష్టించిన కరీంనగర్ దోపిడీ కేసులో బాధితుడి అల్లుడు, మనవడే సూత్రధారులని పోలీసుల విచారణలో తేలింది. ఈ నెల 21న రాత్రి జరిగిన చోరీ కేసును ఛేదించిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 43.67 గ్రాముల బంగారం, 64.98 గ్రాములు వెండి ఆభరణాలు, రూ.2.09 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను సీపీ గౌష్‌ఆలం బుధవారం ఓ ప్రకటనలో వివరించారు. భగత్‌నగర్‌కు చెందిన ఎం.డి అజ్మత్ అలీ నివాసంలో చొరబడిన దుండగులు డమ్మీ పిస్టళ్లు, కత్తులతో బెదిరించి నగదు, బంగారం, వెండితో పరారైన విషయం తెలిసిందే. దోపిడీకి పథకం రచించింది బాధితుడి సొంత అల్లుడు రజావుద్దీన్, మనవడు అజీమ్ రజాలుగా గుర్తించారు. కుటుంబ కలహాల కారణంగా రజావుద్దీన్ భార్య గత ఏడాది కరీంనగర్‌లోని పుట్టింటికి వచ్చింది. ఆమెను తీసుకెళ్లేందుకు వచ్చిన రజావుద్దీన్ ఆత్మహత్యాయత్నం చేసుకోగా, చికిత్స చేయించి తమ ఇంట్లోనే ఉంచుకున్నారు. కుమార్తె, అల్లుడు బాగు పడాలనే ఉద్దేశంతో వస్త్రవ్యాపారం పెట్టించి ఆర్థిక సాయం కూడా చేశారు. కానీ అందులో నష్టపోయిన రజావుద్దీన్ ఇంకా డబ్బులు కావాలంటూ భార్య, మామలను వేధించేవాడు. ఇటీవల రూ.5 లక్షలు ఇవ్వాలని ఒత్తిడి చేయగా.. నిరాకరించడంతో గొడవపడి మంచిర్యాలలో కొత్త దుకాణం పెడుతున్నట్లు చెప్పి ఉత్తర్‌ప్రదేశ్‌లోని సొంత ఊరు మేరఠ్ వెళ్లిపోయాడు. ఇంట్లోని నగదు, బంగారు ఆభరణాలపై అవగాహన ఉన్న అతడు ఈ నెల 20న కరీంనగర్‌కు తిరిగి వచ్చి, మర్నాడు తన కుమారుడు, మరో ముగ్గురితో కలిసి చోరీకి పాల్పడ్డాడు. దర్యాప్తులో భాగంగా ఈ దోపిడీలో భాగమైన మేరఠ్‌కు చెందిన సల్మాన్ అలియాస్ భూరే(22), సల్మాన్ అలియాస్ విమాన్(22), మొహమ్మద్ హసీన్(19)లను బుధవారం అక్కడ కరీంనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని మేరఠ్ న్యాయస్థానంలో హాజరు పరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తరలిస్తున్నారు. రజావుద్దీన్, అజీమ్ రజా పరారీలో ఉన్నారు.

## లేజర్ కటింగ్ యంత్రం కోసుకుపోయి కార్మికుడి దుర్మరణం

### చర్లపల్లి పారిశ్రామికవాడలో ఘటన



**చర్లపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** సీఎన్‌సీ(కంప్యూటర్ న్యూమరికల్ కంట్రోల్) లేజర్ కటింగ్ యంత్రం కోసుకుపోయి కార్మికుడు అక్కడికక్కడే దుర్మరణంపాలైన ఘటన చర్లపల్లి పారిశ్రామికవాడలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కృష్ణా జిల్లాకు చెందిన బత్తుల సురేశ్‌బాబు(37)..20 రోజుల కిందట చర్లపల్లి పారిశ్రామికవాడలోని సుదర్శన్ ఇండస్ట్రీస్‌లో సీఎన్‌సీ ఆపరేటర్‌గా చేరారు. నూతన సీఎన్‌సీ లేజర్ యంత్రం ట్రయల్ రన్ నిర్వహిస్తున్న సురేశ్‌బాబు..బుధవారం మధ్యాహ్నం యంత్రం కింది భాగాన్ని పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు యంత్రం కోసుకుపోవడంతో సెకనులో ఆయన తల, మొండెం వేరై..ఘటనా స్థలం రక్తసిక్తమైంది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీకి తరలించారు. మృతుడికి భార్య, పాప, ఇద్దరు కుమారులున్నారు. మృతుడి కుటుంబానికి పరిహారంగా రూ.31 లక్షలు చెల్లించేందుకు కంపెనీ యాజమాన్యం అంగీకరించింది.

## మాజీ డ్రైవర్ ఇంట్లో 15 కిలోల బంగారం, రూ.5.5 కోట్ల నోట్ల కట్టలు



**కోల్‌కతా, విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమ బెంగాల్‌లో ఓ మాజీ బస్సు డ్రైవర్ ఇంట్లో పెద్దఎత్తున నోట్ల కట్టలు, బంగారం బిస్కెట్లు బయట పడ్డాయి. ఇసుక, క్వారీ మాఫియాపై దర్యాప్తులో భాగంగా చేపట్టిన సోదాల్లో ఈ సొమ్మును పోలీసులు గుర్తించారు. ఇప్పటివరకు రూ.5.5 కోట్ల నగదు, 15 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. బీర్‌భూమ్ జిల్లాకు చెందిన మీనా మండల్ నివాసంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇసుక మాఫియాపై దర్యాప్తులో భాగంగా పక్కా సమాచారంతో ఈ సోదాలు జరిపారు. ఈ క్రమంలోనే అతడి ఇంట్లో భారీగా అక్రమ నగదు బయటపడింది. స్థానికంగా ఇసుక, క్వారీ మాఫియా డాన్‌గా పేర్కొనే తులు మండల్‌కు.. మీనా మండల్ సమీప బంధువు. గతంలో బెంగాల్ ప్రభుత్వంలో బస్సు డ్రైవరుగా పనిచేసిన మీనా.. ఆ తర్వాత ఉద్యోగం మానేసి క్వారీ వ్యాపారం మొదలుపెట్టాడని పోలీసులు తెలిపారు. డబ్బు, బంగారంతో పాటు మీనా పేరుమీద పెద్దఎత్తున ఆస్తులు ఉన్నట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు.

### పాత నోట్ల మార్పిడి కేసులో నిందితుడికి

## రూ. 4.5 కోట్ల జరిమానా

**బేగంపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రద్దయిన పాత నోట్ల మార్పిడి కేసులో నిందితులకు భారీ జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. కేసులో ఏ-1 ముద్దాయికి ఏకంగా రూ.4.5 కోట్లు జరిమానా విధించగా, మిగిలిన పది మంది నిందితులకు రూ.60 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పడం సంచలనం సృష్టించింది. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలను సీఐ సైదులు, ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు. 2017 మార్చి 13న అర్ధరాత్రి బేగంపేట శ్యామ్ లాల్ బిల్డింగ్ ప్రాంతంలో కొందరు గుమిగూడి ఉన్నట్టు గస్తీ పోలీసులు గుర్తించి ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెప్పారు. మరో పెట్రోలింగ్ వాహనం అక్కడికి వచ్చేసరికి నిందితులు పారిపోయారు. వెంబడించిన పోలీసులు వారిని ఒక అపార్ట్‌మెంట్‌లో పట్టుకున్నారు. రద్దయిన పాత నోట్లను మార్పిడి చేసే ముఠాగా గుర్తించారు. రూ.1.20 కోట్ల మేర నోట్ల మార్పిడికి ప్రయత్నిస్తున్నట్టు గుర్తించి నిందితులను అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచారు. కేసు విచారణ కొనసాగించిన సికింద్రాబాద్ 11వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ బుధవారం తీర్పును వెలువరించారు. నిందితుల్లో ఏ-1గా ఉన్న ఎ.యాదగిరికి రూ.4.5 కోట్ల జరిమానా విధించారు. మిగిలినవారికి రూ.60 వేల చొప్పున జరిమానాతో పాటు నిందితులందరికీ మూడు సంవత్సరాల ఆరు నెలల జైలు శిక్ష విధించారు.












# క్యాడర్ ఫుల్.. నాయకత్వం నిల్!

## జనసేనకు 'సైన్యాధిపతి' కరువాయే!

- ప్రత్తిపాడులో దిక్కుతోచని స్థితిలో జనసేన శ్రేణులు
- నియోజకవర్గ ఇన్చార్జి లేక సమన్వయం గాడితప్పుతోందంటున్న కార్యకర్తలు
- కూటమి అధికారంలో ఉన్నా ప్రాధాన్యం దక్కడం లేదని ఆవేదన
- నామినేటెడ్ పదవుల్లోనూ అన్యాయం జరిగిందనే అసంతృప్తి
- బలమైన కార్యకర్తలపై వైకాపా, తెదేపా 'ఆపరేషన్ ఆకర్ష్' చేపట్టాయనే ప్రచారం
- ఇప్పటికైనా బలమైన నాయకుడిని నియమించకపోతే పార్టీకి తీవ్ర నష్టమే!

**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ ప్రత్యేక ప్రతినిధి:**

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో జనసేన పార్టీకి కార్యకర్తల బలం ఉన్నా.. వారిని ముందుండి నడిపించే నాయకత్వం లేక శ్రేణులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ, సమస్య వచ్చినప్పుడు అండగా నిలిచే నాయకుడు లేకపోవడం తీవ్ర అసంతృప్తికి కారణమవుతోంది. కూటమి ప్రభుత్వంలో జనసేన కీలక భాగస్వామిగా కొనసాగుతున్న సమయంలోనూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో పార్టీ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయి నియోజకవర్గ ఇన్చార్జిని నియమించకపోవడం వల్ల పార్టీ కార్యక్రమాలు, కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యలపై పోరాటం ఆశించిన స్థాయిలో సాగడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**తమ్మయ్యబాబుపైనే ఆశలు పెట్టుకున్న శ్రేణులు**

2019 సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిగా దివంగత నేత వరుపుల తమ్మయ్యబాబు ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో విజయం సాధించకపోయినప్పటికీ, నియోజకవర్గంలో పార్టీకి బలమైన పునాది ఏర్పడుతుందని కార్యకర్తలు ఆశించారు. తమ్మయ్యబాబు నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతమవుతుందని భావించిన గ్రామస్థాయి కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో పనిచేశారు. అయితే 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జనసేన కార్యకర్తలు రాజకీయంగా, వ్యక్తిగతంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ఆ సమయంలో తమ సమస్యలను వినేందుకు, అండగా నిలిచేందుకు నియోజకవర్గ స్థాయిలో బలమైన నాయకత్వం లేకపోయిందని వారు గుర్తుచేస్తున్నారు.

**సస్పెన్షన్.. నాలుగు నెలల్లోనే విషాదం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా వైద్యురాలిని దూషించారనే ఆరోపణల నేపథ్యంలో పార్టీ నాయకత్వం విచారణ జరిపి తమ్మయ్యబాబును సస్పెండ్ చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సస్పెన్షన్ అనంతరం నాలుగు నెలల వ్యవధిలోనే ఆయన గుండెపోటుతో మరణించడం స్థానిక జనసేన శ్రేణులను తీవ్ర విషాదంలోకి నెట్టింది. తమ్మయ్యబాబు మరణం తరువాత నియోజకవర్గంలో ఏర్పడిన నాయకత్వ లోటు ఇప్పటికీ భర్తీ కాలేదనే అభిప్రాయం కార్యకర్తల్లో బలంగా వినిపిస్తోంది.

**సమన్వయకర్త ఉన్నా.. సమన్వయం ఎక్కడ?**

ప్రస్తుతం కత్తిపూడి గ్రామానికి చెందిన మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబీ) నియోజకవర్గ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. అయితే కార్యకర్తలను సమన్వయం చేయడంలో, వారి సమస్యలను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లడంలో, కష్టకాలంలో అండగా నిలవడంలో ఆశించిన స్థాయిలో చొరవ కనిపించడం లేదని కొందరు కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం, నాలుగు మండలాల్లో కార్యకర్తలను ఒకే వేదికపైకి తీసుకురావడం, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా చూడడం, అధికారుల వద్ద పార్టీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించడం వంటి అంశాల్లో బలమైన నాయకత్వం అవసరమని వారు కోరుతున్నారు.

**కూటమి అధికారంలోనూ కార్యకర్తలకు నిరాశేనా?**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ప్రత్తిపాడు నియోజకవర్గంలో జనసేన కార్యకర్తలకు తగిన గౌరవం, ప్రాధాన్యం దక్కడం లేదనే అసంతృప్తి పెరుగుతోంది. ప్రభుత్వ కార్యక్రమాలు, అధికారిక సమావేశాలు, స్థానిక అభివృద్ధి నిర్ణయాల్లో జనసేన శ్రేణులను పక్కన పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నామినేటెడ్ పదవుల పంపిణీలోనూ ప్రత్తిపాడు నియోజకవర్గానికి అన్యాయం జరిగిందని కార్యకర్తలు వాపోతున్నారు. పార్టీ కోసం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసులు, ఒత్తిళ్లు ఎదుర్కొని పనిచేసిన వారిని అధికారంలోకి వచ్చిన తరువాత గుర్తించకపోతే ఎలా అని వారు ప్రశ్నిస్తున్నారు.

**'క్యాడర్ ఫుల్.. నాయకత్వం నిల్'**

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో జనసేనకు గ్రామస్థాయి వరకు బలమైన కార్యకర్తల వ్యవస్థ ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా కాపు సామాజికవర్గం అధికంగా ఉండడం జనసేనకు రాజకీయంగా కలిసొచ్చే అంశంగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. అయితే ఈ బలాన్ని రాజకీయ శక్తిగా మలిచే నాయకత్వం లేకపోవడం పార్టీకి ప్రధాన బలహీనతగా మారింది. కార్యకర్తలు ఉన్నారు.. అభిమానులు ఉన్నారు.. పవన్ కల్యాణ్‌పై విశ్వాసం ఉంది.. కానీ వారిని నడిపించే నియోజకవర్గ స్థాయి నాయకుడు లేరనే భావన శ్రేణుల్లో బలపడుతోంది.

**'ఆపరేషన్ ఆకర్ష్'తో ప్రత్యర్థుల వల**

జనసేనలో నాయకత్వ లోటును అవకాశంగా తీసుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోపాటు కూటమిలోని తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు స్థానిక నాయకులు బలమైన జనసేన కార్యకర్తలను తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు ప్రారంభించారనే ప్రచారం నియోజకవర్గంలో ఊపందుకుంది. పార్టీలో గుర్తింపు, పదవులు, రాజకీయ భవిష్యత్తుపై స్పష్టత లేకపోవడంతో కొందరు కార్యకర్తలు ప్రత్యామ్నాయ మార్గాల వైపు చూస్తున్నారనే చర్చ సాగుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే గ్రామస్థాయిలో ఎంతో కష్టపడి నిర్మించుకున్న జనసేన శ్రేణులు చెల్లాచెదురయ్యే ప్రమాదం ఉందని రాజకీయ పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

**పవన్ కల్యాణ్ దృష్టి సారించాలి**

రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో జనసేన పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చర్యలు చేపడుతున్న సమయంలో ప్రత్తిపాడు నియోజకవర్గంపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కార్యకర్తలు కోరుతున్నారు. ప్రజల్లో ఆదరణ కలిగి, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ, కూటమి పార్టీలతో సమన్వయం చేసుకోగలిగే బలమైన నాయకుడికి నియోజకవర్గ ఇన్చార్జి బాధ్యతలు అప్పగించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

**అధిష్ఠానం మౌనం వీడకపోతే నష్టమే!**

ప్రత్తిపాడు నియోజకవర్గంలో జనసేనకు రాజకీయంగా విస్తరించేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నప్పటికీ, నాయకత్వ లోటును పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తే పార్టీకి తీవ్ర నష్టం తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా జనసేన రాష్ట్ర నాయకత్వం స్పందించి పూర్తిస్థాయి నియోజకవర్గ ఇన్చార్జిని ప్రకటించాలి. కూటమి నాయకత్వం కూడా జనసేన కార్యకర్తలకు తగిన గౌరవం, ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం, నామినేటెడ్ పదవుల్లో సముచిత ప్రాధాన్యం కల్పించాలి. లేకపోతే గ్రామస్థాయిలో బలంగా ఉన్న జనసేన సైన్యం.. సైన్యాధిపతి లేక చెల్లాచెదురయ్యే ప్రమాదం ఉందనే హెచ్చరికలను పార్టీ అధిష్ఠానం తేలికగా తీసుకోకూడదు.

### ప్రత్తిపాడులో జనసేన పరిస్థితి ఇదీ..

- **కార్యకర్తల బలం:** గ్రామస్థాయి వరకు విస్తృతగా
- **పూర్తిస్థాయి ఇన్చార్జి:** లేదు
- **ప్రస్తుత బాధ్యత:** నియోజకవర్గ సమన్వయకర్త
- **కార్యకర్తల ప్రధాన డిమాండ్:** బలమైన నాయకుడి నియామకం
- **ప్రధాన అసంతృప్తి:** గుర్తింపు, నామినేటెడ్ పదవులు, ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థాధాన్యం
- **పార్టీకి ముప్పు:** ప్రత్యర్థి పార్టీల 'ఆరవేషన్ ఆకర్ష'
- **అధిష్ఠానానికి హెచ్చరిక:** తక్షణ నిర్ణయం లేకపోతే క్యాడర్ బలహీనపడే ప్రమాదం

# చిన్ని గుండెకు పెద్ద కష్టం...

## దాతల చేయూత కోసం ఎదురుచూపులు



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** వయసు చిన్నది... కానీ ఎదురైన సమస్య మాత్రం చాలా పెద్దది. తూర్పుగోదావరి జిల్లా, మండల కేంద్రమైన రాయవరం గ్రామానికి చెందిన నేతల రామారావు (రాంబాబు), సంధ్యాదేవి దంపతుల కుమారుడు యశ్వంత్ సాత్విక్ (4) పుట్టుకతోనే గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యుల పరీక్షల్లో చిన్నారికి అత్యవసరంగా గుండె శస్త్రచికిత్స అవసరమని తేలగా తొలుత చికిత్సకు రూ.6.15 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు అంచనా వేశారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు ఉండవిల్లి రాంబాబు చొరవ తీసుకుని మండపేట శాసనసభ్యులు వేగుళ్ల జోగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సుమారు రూ.3 లక్షల ఆర్థిక సాయం ఆసుపత్రి ఖాతాకు చేరేలా చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ మిగిలిన చికిత్స ఖర్చు ఆ కుటుంబానికి భారంగా మారింది ఆ మొత్తాన్ని సమకూర్చుకునే స్తోమత కుటుంబానికి లేదు. రామారావు (రాంబాబు) స్కూల్ బస్ డ్రైవర్గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. సాధారణ ఆదాయంతో కుటుంబ అవసరాలు తీర్చుకోవడమే కష్టంగా ఉండటంతో, చిన్నారి చికిత్స ఖర్చులు భరించడం వారికి మరింత భారంగా మారింది. ఈ నేపథ్యంలో చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు దాతలు, సేవాభావం కలిగిన వ్యక్తులు ముందుకు వచ్చి తమ వంతు ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. ఒక చిన్న సహాయం కూడా ఆ చిన్నారి జీవితంలో కొత్త వెలుగులు నింపగలదని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సహాయం చేయాలనుకునే వారు చిన్నారి తండ్రి నేతల రామారావు (రాంబాబు) 9642772357, మిర్తిపాటి లక్ష్మీ స్వరూప 9642166960, కచ్చా రాజశేఖర్ 9441144453 నంబర్ లలో సంప్రదించి తమ వంతు సహకారం అందించాలని కోరుతున్నారు. "చిన్నారి చిరునవ్వును కాపాడేందుకు మనం చేయూతనిద్దాం... మన చిన్న సహాయం ఒక ప్రాణాన్ని నిలబెట్టవచ్చు."

ఆగస్టు 1న మండపేటలో

# మెగా జాబ్ మేళా

## నిరుద్యోగులు సద్వినియోగించుకోవాలి

**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** వికాస ఆధ్వర్యంలో ఆగస్టు 1వ తేదీ శనివారం మండపేటలోని శ్రీ వైష్ణవి ఐ టి ఐ కాలేజ్ లో భారీ జాబ్ మేళా నిర్వహించనున్నారు.ఈ జాబ్ మేళాలో పలు ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయి. ఇన్నావ్ ఎక్స్ పీరియన్స్, ఇసూర్య సొల్యూషన్స్, డిస్కవర్ కమ్యూనికేషన్స్, ఫాక్స్ కాన్, ప్రీమియర్ ఎనర్జీస్, సుందరం ఫైనాన్స్, అపోలో లైఫ్, ఇసుజు మోటార్స్, హోండాయి మోబిస్, టి.హెచ్.కె. ఇండియా వంటి కంపెనీల్లో బి పి ఓ, టూల్ సేల్స్ రిప్రజెంటేటివ్, మొబైల్ ఆపరేటర్, లైసెన్స్ ఆపరేటర్, టెక్నీషియన్, ట్రైనీ తదితర పోస్టులకు ఇంటర్వ్యూలు ఉంటాయి.అర్హతలు ఎస్ ఎస్ సి,ఇంటర్, డిగ్రీ,ఐ టి ఐ, డిప్లొమా, బి టెక్ ఉత్తీర్ణులైన 18 నుండి 30 సంవత్సరాల వయసు గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన వారికి నెలకు రూ 16,000/- నుండి రూ 21,000/- వరకు జీతంతో పాటు ఇన్సెంటివ్స్, భోజనం, వసతి ¢ రవాణా సౌకర్యం కూడా కంపెనీని బట్టి లభిస్తుంది.ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆగస్టు 1వ తేదీ శనివారం ఉదయం 9.00 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో శ్రీ వైష్ణవి ఐ.టి.ఐ కాలేజ్, మండపేటకు హాజరుకావాలని నిర్వాహకులు తెలిపారు.మరిన్ని వివరాలకు 8121197258, 9949233577 సంప్రదించాలి.


మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!
నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!
• బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
• రోజువారీ తెలుగు దినపత్రిక PDF
• అంతర్జాతీయ, జాతీయ వార్తలు
• విశ్లేషణాత్మక కథనాలు
VISWAM VOICE BREAKING NEWS
WhatsApp channel
మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి
JOIN NOW
లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:
https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E
మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.





# స్నేహం సమాజానికి, దేశ ఐక్యతకు బలం

**మానవ అక్రమ రవాణా నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత**

**అంతర్జాతీయ స్నేహ దినోత్సవం, ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపు**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతి ఏడాది జూలై 30న నిర్వహిస్తున్న అంతర్జాతీయ స్నేహ దినోత్సవం మరియు ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రజలకు శుభాకాంక్షలు, సందేశాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్నేహం అనేది మనుషులను కలిపే గొప్ప బంధమని, ప్రేమ, విశ్వాసం, పరస్పర గౌరవం, సహకారం వంటి విలువలను పెంపొందించడంలో స్నేహానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. యువత మంచి స్నేహాలను పెంపొందించుకుని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజలు.. దేశాలు.. సంస్కృతుల మధ్య స్నేహం,శాంతి భావాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మానవ అక్రమ రవాణా అనేది సమాజానికి మచ్చ తెచ్చే ఘోర నేరమని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులు, బలహీన వర్గాలపై జరుగుతున్న అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనుమానాస్పద ఘటనలు కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి బాధితులను రక్షించేందుకు సహకరించాలని కోరారు. ప్రజల్లో అవగాహన పెంపొందించడం బాధితులకు రక్షణ కల్పించడం, నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే మానవ అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలించగలమని మంత్రి సుభాష్ తెలిపారు. స్నేహ బంధాలను బలోపేతం చేద్దాం... మానవ అక్రమ రవాణా రహిత సమాజ నిర్మాణానికి కలిసి పనిచేద్దాం అని మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు.

**ప్రభుత్వ సామాన్య ఆసుపత్రుల**

# మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

**ఆగస్టు నుంచి వారానికో ఆసుపత్రిపై ప్రత్యేక సమీక్ష : జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్.మహేష్ కుమార్**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ సామాన్య ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్, హాస్పిటల్ సర్వీసెస్, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు చెందిన అధికారులతో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ నిధుల వినియోగం, ఆసుపత్రుల పనితీరు, మందుల పంపిణీ, చెత్త సేకరణ, పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యం తదితర అంశాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేసి, ఆసుపత్రుల నిర్వహణను సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రుల అభివృద్ధి, మౌలిక వసతులు, వైద్య సేవలు, ఎదుర్కొంటున్న సమస్యలపై నిర్వహించిన ప్రాథమిక సమీక్షలో అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆగస్టు మొదటి వారం నుంచి సెప్టెంబర్ చివరి వరకు జిల్లాలోని ప్రతి బోధనా ఆసుపత్రితో పాటు అనుబంధ జనరల్ ఆసుపత్రుల పనితీరుపై వారానికో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రతి ఆసుపత్రిలో వైద్య సేవలు, మౌలిక సదుపాయాలు, సిబ్బంది పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి వారం ఒక ఆసుపత్రిని ఎంపిక చేసి సంబంధిత సూపరింటెండెంట్లు, విభాగాధిపతులు (హెచ్‌వోడీలు), కన్సల్టెంట్లతో సమావేశమై ఆసుపత్రి పనితీరును సమీక్షించాలని సూచించారు. విద్యుత్ పనులు పూర్తయిన నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న సివిల్ నిర్మాణ పనులను ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. డయాలసిస్ సేవలు, ఆసుపత్రుల పరిశుభ్రత, ఉచిత వైద్య పరీక్షల నిర్వహణ, ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల మంజూరుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆసుపత్రుల్లో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది ఖాళీలను గుర్తించి భర్తీకి ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో పాటు అవసరమైన నూతన వైద్య పరికరాల వివరాలను కూడా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ డాక్టర్ కె. కార్తీక్, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ పి. రాధాకృష్ణ, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి సీహెచ్. శ్రీనివాస్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని సెకండరీ హెల్త్ సర్వీసెస్ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఇతర రాష్ట్రాల్లో సమగ్ర శిక్ష ఉద్యోగుల రెగ్యులరైజేషన్ సాధ్యమైనప్పుడు**

# ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు సాధ్యం కాదు

**ఛలో కలెక్టరేట్‌లో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సమగ్ర శిక్ష ఉద్యోగులు**




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈరోజు జిల్లా కలెక్టరేట్ వద్ద ఏపీ స్టేట్ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జేఏసీ ఆధ్వర్యంలో "ఛలో కలెక్టరేట్" కార్యక్రమం నిర్వహించి, జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, లిపంజాబ్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, మధ్యప్రదేశ్, సిక్కిం, అస్సాం, మణిపూర్ రాష్ట్రాల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులకు రెగ్యులరైజేషన్ లేదా ఉద్యోగ భద్రతకు సంబంధించిన నిర్ణయాలు తీసుకున్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు సాధ్యం కావడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యా వ్యవస్థకు వెన్నెముకగా పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎన్నో సంవత్సరాలుగా నిరంతరాయంగా సేవలందిస్తున్నప్పటికీ ఇప్పటికీ ఉద్యోగ భద్రత, హెచ్‌ఆర్ పాలసీ, సరైన వేతనాలు, సామాజిక భద్రతా ప్రయోజనాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే జూన్ జీతాలు ఇప్పటికీ చెల్లించకపోవడం వల్ల వేలాది మంది ఉద్యోగులు, వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేసి జూన్, జూలై నెలల జీతాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వెంటనే క్రింది డిమాండ్లను అమలు చేయాలని కోరారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి.

సమగ్ర హెచ్‌ఆర్ పాలసీని తక్షణమే అమలు చేయాలి.

మినిమం ఆఫ్ ఆఫ్ టైం స్కేల్ అమలు చేసి తక్షణమే వేతనాలు పెంచాలి ప్రతి నెలా సకాలంలో జీతాలు చెల్లించాలి.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా మార్చాలి.

పార్ట్‌టైమ్ విధానం తొలగించి ఫుల్‌టైమ్ ఉద్యోగులుగా మార్చాలి.

పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచి ఈపీఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్ తదితర ప్రయోజనాలు కల్పించాలి.

ఉద్యోగులకు ఆరోగ్య భద్రత, ఉద్యోగ భద్రత కల్పించాలి.




ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.

టీచర్స్ డీఎస్సీతో పాటు అన్ని ప్రభుత్వ రెగ్యులర్ ఉద్యోగ నియామకాలలో సమగ్ర శిక్ష ఉద్యోగులకు సర్వీస్ వెయిటేజ్ కల్పించాలి.

ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకొని జూన్, జూలై నెలల జీతాలకు చెల్లించేందుకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆగస్టు 24న నిర్వహించనున్న "ఛలో విజయవాడ" కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున విజయవంతం చేస్తామని, వేలాది మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని తమ హక్కుల సాధన కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# తల్లిదండ్రుల త్యాగాలకు చిన్నారుల ఘన వందనం

**భాష్యం పాఠశాలలో హృద్యంగా తల్లిదండ్రుల దినోత్సవ వేడుకలు - పాదపూజతో కృతజ్ఞత చాటిన విద్యార్థులు - కుటుంబ విలువలను పెంపొందిస్తున్న భాష్యం విద్యాసంస్థలు**

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని భాష్యం పాఠశాలలో తల్లిదండ్రుల దినోత్సవ వేడుకలు గురువారం అత్యంత వైభవంగా, భావోద్వేగపూరిత వాతావరణంలో నిర్వహించారు. విద్య అనేది కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, సంస్కారం, క్రమశిక్షణ, పెద్దల పట్ల గౌరవం, కుటుంబ విలువలు వంటి జీవితానికి అవసరమైన అంశాలను విద్యార్థుల్లో పెంపొందించాలనే లక్ష్యంతో భాష్యం పాఠశాల యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహించింది. భాష్యం పాఠశాలల జోనల్ ఇంచార్జి జవ్వాది వెంకట శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సుమారు 400 మందికి పైగా తల్లిదండ్రులు హాజరై వేడుకలను విజయవంతం చేశారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు సంప్రదాయబద్ధంగా పాదపూజ చేసి, పూలదండలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తమ కోసం జీవితాంతం కష్టపడుతూ, ఎన్నో త్యాగాలు చేస్తూ కుటుంబాన్ని ముందుకు నడిపించే తల్లిదండ్రుల పట్ల గౌరవం, ప్రేమ, కృతజ్ఞతను చిన్నారులు ఈ సందర్భంగా హృదయపూర్వకంగా వ్యక్తం చేశారు. ఈ దృశ్యాలను తిలకించిన పలువురు తల్లిదండ్రులు భావోద్వేగానికి లోనయ్యారు. తమ పిల్లలు ఇలాంటి విలువలను అలవరచుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, విద్యతో పాటు సంస్కారాన్ని కూడా బోధిస్తున్న






భాష్యం పాఠశాల యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జవ్వాది వెంకట శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రతి బిడ్డ జీవితంలో తొలి గురువులు తల్లిదండ్రులేనని అన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం వారు ఎన్నో కష్టాలు, త్యాగాలు చేస్తారని, ఆ ప్రేమను, ఆప్యాయతను, బాధ్యతను ప్రతి విద్యార్థి గుర్తించి జీవితాంతం గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ఉన్నత విద్యతో పాటు మంచి వ్యక్తిత్వం, మానవీయ విలువలు, పెద్దల పట్ల గౌరవం కలిగిన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడమే భాష్యం విద్యాసంస్థల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నేటి సమాజంలో కుటుంబ బంధాలు, మానవీయ విలువలు క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించడంతో పాటు తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తాయని ఆయన వివరించారు. పిల్లలు జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా తమ తల్లిదండ్రులను గౌరవించడం, వారి సేవలను గుర్తుంచుకోవడం నిజమైన విజయమని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సి.హెచ్. రవి మాట్లాడుతూ, విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు నైతిక విలువలు, కుటుంబ బంధాల ప్రాధాన్యతను తెలియజేయడానికి భాష్యం పాఠశాల ఎల్లప్పుడూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. విద్యార్థుల సమగ్ర వికాసమే తమ విద్యా విధానానికి మూల సూత్రమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కే.నాగశ్రీ, కే.రాజేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. తల్లిదండ్రుల పట్ల ప్రేమ, గౌరవం, కృతజ్ఞతను చాటిన ఈ కార్యక్రమం ప్రతి ఒక్కరినీ భావోద్వేగానికి గురిచేయడంతో పాటు కుటుంబ విలువల పరిరక్షణకు భాష్యం పాఠశాల చేస్తున్న కృషికి నిదర్శనంగా నిలిచింది.

**రైతు బజార్లలో రాయితీ ధరలకు**

# సన్న బియ్యం విక్రయం

**సన్నాలు రూ.50, స్టీమ్ రైస్ రూ.52.. ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు చేయాలని జేసీ ఆదేశాలు**



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో రైతు బజార్ మార్కెట్లలో రాయితీ ధరలకు సన్న బియ్యం పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్ నైడియా దేవి అధికారులను ఆదేశించారు. గురువారం జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో రైస్ మిల్లర్ల యాజమాన్యం, పౌర సరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 3 నుంచి జిల్లాలోని రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా బియ్యం విక్రయాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ పథకం కింద సన్న బియ్యం కిలో రూ.50, స్టీమ్ రైస్ కిలో రూ.52 ధరకు అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలను నియంత్రించడం, సామాన్య ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరల్లో అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజల రద్దీ అధికంగా ఉండే రైతు బజార్లలో ప్రత్యేక విక్రయ కౌంటర్లు ఏర్పాటు చేసి వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.రైస్ మిల్లర్లు తగినంత బియ్యం నిల్వలను సిద్ధంగా ఉంచడంతో పాటు నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడకుండా సరఫరా చేయాలని సూచించారు. ప్రతి కౌంటర్‌లో రోజువారీ విక్రయాలు, ప్రారంభ మరియు ముగింపు నిల్వల వివరాలను రిజిస్టర్లలో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. బియ్యం కొరత తలెత్తకుండా పౌర సరఫరాల శాఖ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి అడపా ఉదయ భాస్కర్, సమాచార ఌ పౌర సంబంధాల శాఖ అధికారి సి.హెచ్. శ్రీనివాస్, కోనసీమ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి. లక్ష్మీనారాయణ, కొత్తపేట రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు ఓ. పాపారావు, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, రైతు బజార్ ఎస్టేట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల క్రీడా ప్రతిభ

**జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అమరావతి ఛాంపియన్ కప్ 2026 పురస్కరించుకొని నిర్వహించిన అండర్-23 విభాగం క్రీడా పోటీలలో కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ డాక్టర్ కే. చిట్టిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి మన రాష్ట్ర కీర్తి ప్రతిష్టలను దేశస్థాయిలో నిలబెట్టాలని ఆకాంక్షించారు. కళాశాల స్థాయిలో కబడ్డీ, బాస్కెట్ బాల్, వాలీబాల్, యోగా, అథ్లెటిక్స్ వంటి వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించగా బాలుర విభాగంలో సీహెచ్. రాజేష్, ఎం.అర్జున్, జీ.మహేష్, పి.శ్రీనివాస్, జీ.రోహిత్ కుమార్, జీ.రాజు, కే.శివకృష్ణ, ఎం.తేజ, వై.సుకేష్, వై.పవన్ కుమార్, డి.నానిలు ప్రతిభ చాటారు. అలాగే బాలికల విభాగంలో ఎం.ప్రగతి, సీహెచ్. దేవి, కే.ప్రవళిక, కే.మౌనిక, డి.వైష్ణవి, పి.దీక్షిత, జీ.రమ్య, ఎస్. సింధు, పి. చంద్రకళ, డి. యజ్ఞలు విజేతలుగా నిలిచారు. ప్రతిభ కనబరిచిన ఈ విద్యార్థులందరూ అమలాపురంలో జరగనున్న 'అమరావతి ఛాంపియన్ కప్' జిల్లా స్థాయి పోటీల్లో కళాశాల తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పి. నూకరాజు వెల్లడించారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. శ్రీనివాస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్ ఛార్జ్ టి. శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది అభినందించి, తదుపరి పోటీల్లో విజయం సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు.

**వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు దక్కించుకున్న**

# మోడరన్ జూనియర్ కాలేజీ విద్యార్థిని శ్రీజ శార్వాణి



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం మోడరన్ జి.ఆర్.సి జూనియర్ కాలేజీలో ఇంటర్ బైపీసీ గ్రూపు ద్వితీయ సంవత్సరం చదువుతున్న టి. శ్రీజ శార్వాణి ప్రతిష్టాత్మక వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో పేరు దక్కించుకుంది. మే నెల రెండవ తేదీన రాజమహేంద్రవరం ఆనం కళాక్షేత్రంలో జరిగిన కూచిపూడి నాట్య కార్యక్రమంలో పాల్గొని శ్రీజ ఈ ఘనత సాధించినట్లు మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి. వి.రావు గురువారం తెలిపారు. ఆ కార్యక్రమంలో నిర్విరామంగా 12 గంటల పాటు అన్నమాచార్యుల 108 శ్లోకాలకు 200 మంది కూచిపూడి కళాకారులు నాట్యం చేసారని, ఆ బృందంలో శ్రీజ ఒకరని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా శ్రీజని అధినేత జి.వి.రావు,ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్ సి. హెచ్. రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ పి. ఎస్. ప్రకాష్, అకాడమిక్ అడ్వైజర్ సి. హెచ్. శ్రీనివాస్, ఇంటర్మీడియట్ స్టాఫ్ అభినందించారు.శ్రీజ తండ్రి కృష్ణ మోహన్ స్థానికంగా వ్యాపారవేత్త కాగా శ్రీజ తల్లి సుధామణి గృహిణి.ఈ సందర్భంగా జి.వి.రావు మాట్లాడుతూ భవిష్యత్తులో శ్రీజ మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

**మోడీ పర్యటన నేపథ్యంలో**

# రెండు రోజుల ముందుగానే పెన్షన్ పంపిణీ



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భోగాపురం ఇంటర్నేషనల్ విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆగస్టు 1న పర్యటించనున్న నేపథ్యంలో, పెన్షన్ లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం రెండు రోజుల ముందుగానే,ఈ రోజు జూలై 30న పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ రావుతో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్ స్వయంగా ఇంటింటికి వెళ్లి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. లబ్ధిదారుల యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో తమ కట్టుబాటును తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు ప్రభుత్వం పెన్షన్లను ముందుగానే అందజేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ, తమకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు, మాజీ మంత్రి ఎడారి శ్రావణ్ కుమార్, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విలసవెల్లి సోమాలమ్మ అమ్మవారికి ఆషాఢ మాస జాతర!



**ఉప్పలగుప్తం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉప్పలగుప్తం మండలం విలసవిల్లిలో కొలువైన సోమాలమ్మ అమ్మవారికి ఆషాఢ మాస జాతర వైభవంగా జరిగింది. గురువారం జరిగిన ఈ వేడుకలో భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు, భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పట్టు వస్త్రాలతో అమ్మవారిని సుందరంగా అలంకరించి తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ ఆధ్యాత్మిక వేడుకతో గ్రామమంతా భక్తిశ్రద్ధలతో కళకళలాడింది.

# చెరువుపై తివాచీ పరిచిన పిల్లడుగు



**ఉప్పలగుప్తం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని తిమ్మాపురం చెరువు నీటి జాడలేకుండా కనుమరుగవుతోంది. ఈ చెరువుపై పిల్లడుగు మొక్కలు తివాచీ పరిచినట్లుగా విస్తరించి పూర్తిగా ఆక్రమించాయి. చెరువు నిండా ఇవే పరచుకోవడంతో అసలు నీరు కనిపించడం లేదు. అయితే పచ్చదనం కారణంగా కొందరు ఫొటో షూటర్లు ఇక్కడకు వచ్చి షూటింగ్లు చేసుకుంటున్నారు. చెరువు అంతా పచ్చగా కనిపిస్తుండటం ఆనందంగా ఉందని స్థానికులు అంటున్నారు.

22ఎ నిషేధిత భూముల
# సవరణకు అవకాశం
ఆర్డీఓ మల్లిబాబు



కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ : 22ఎ నిషేధిత జాబితాలో పొరపాటున చేర్చబడినట్లు భావించే భూయజమానులు ప్రైవేట్ పట్టా భూములను సవరించుకునేందుకు బాధితులు తమ పరిధిలోని తహశీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్ మల్లిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రెవెన్యూ (రిజిస్ట్రేషన్) శాఖ జారీ చేసిన జీవో నెం. 444 (తేదీ: 27.07.2026) ప్రకారం 22ఎ భూముల పరిష్కారానికి ప్రభుత్వం సమగ్ర మార్గదర్శకాలను విడుదల చేసిందని, కావున ప్రైవేట్ పట్టా భూములు పొరపాటున ఈ జాబితాలో చేర్చబడినట్లు భావించే భూ యజమానులు తమ పట్టాదారు పాస్‌బుక్, రిజిస్టర్డ్ దస్తావేజులు, రెవెన్యూ రికార్డులు, కోర్టు ఉత్తర్వులు (ఉన్నట్లయితే), తాజా ఎన్‌కంబ్రెన్స్ సర్టిఫికేట్ మరియు ఇతర ఆధార పత్రాలతో సంబంధిత తహశీల్దారు వారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమర్పించిన దరఖాస్తులను అధికారులు జీవో నెం. 444 మరియు ప్రభుత్వ నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి అర్హత ఉన్న కేసుల్లో తదుపరి చర్యలు చేపడతారని, ప్రైవేట్ పట్టా భూ యజమానులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో మల్లిబాబు కోరారు.

# వెట్టి చాకిరి నిర్మూలన ప్రచారం ప్రారంభం




కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ : వెట్టిచాకిరి నిర్మూలనకు చేంజెస్ స్వచ్ఛంద సంస్థ ఎంతో పని చేస్తుందని ఆ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్లు కె.పుష్ప కుమార్, పి.దుర్గా భవానిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు గురువారం కాకినాడలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి సిహెచ్ వెంకటలక్ష్మి చాంబర్లో వెట్టిచాకిరి నిర్మూలన సంబంధించిన ప్రచార పత్రం, బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుష్ప కుమార్ దుర్గాభవాని మాట్లాడుతూ వెట్టిచాకిరి నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తుందని అందులో భాగంగా తన వంతు సహకరిస్తున్నట్లు చెప్పారు. గురువారం నుంచి వట్టి చాకిరి నిర్మూలనపై ఉధృతస్థాయిలో ప్రచారం చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ సూరాడ శివ, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి జి.రాంబాబు, కె.సరళ కుమారి, ఎం.నాగదుర్గ, పి.సరోజ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం 26 వేలు చేయాలని
# సీఐటీయు ధర్నా



కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ : రాష్ట్రంలోని అన్ని రంగాల కార్మికులకు నెలకు కనీస వేతనం 26 వేలు అమలు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) కల్పించి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం పిఠాపురం రాజా సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్‌కు వినతిపత్రం సమర్పించారు. సమస్యల పరిష్కారంపై సంబంధిత శాఖ అధికారులతో 10 రోజుల్లో సమావేశం ఏర్పాటు చేస్తామని జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 71 షెడ్యూల్ పరిశ్రమల్లో కనీస వేతనాలను 15 ఏళ్లుగా సవరించలేదని విమర్శించారు. పెరిగిన జీవన వ్యయానికి అనుగుణంగా వేతనాలు పెంచాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. స్కూల్ ఆయాలు, పంచాయతీ కార్మికుల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని, ఆక్వా పరిశ్రమల్లో పీఎఫ్, ఈఎస్ఐతో పాటు కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని కోరారు. కాకినాడ జీజీహెచ్‌లో పనిచేస్తున్న శానిటేషన్, మెస్, సెక్యూరిటీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని, సెకండ్ ఏఎన్ఎంలుగా ఉన్న 52 మందిని సచివాలయ ఏఎన్ఎంలుగా నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ధర్నాలో వివిధ ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొని మద్దతు తెలిపారు.

ఆగస్టు 1న ఎన్టీఆర్ భరోసా
# పింఛన్ల పంపిణీ



కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ : ఆగస్టు 1న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. జిల్లాలో 2,66,152 మంది లబ్ధిదారులకు రూ.116.72 కోట్ల పింఛను సొమ్మును సచివాలయ సిబ్బంది శనివారం ఉదయం 6.30 గంటల నుంచి నేరుగా ఇంటి వద్దే అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు నెలకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో కొత్తగా 221 స్పౌజ్ పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. తొలి రోజే 100 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యేలా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో అత్యధికంగా కాకినాడ అర్బన్‌లో 28,674 మంది లబ్ధిదారులకు రూ.12.60 కోట్లు, కాకినాడ రూరల్‌లో 17,961 మందికి రూ.7.82 కోట్లు, తొండంగిలో 12,158 మందికి రూ.5.39 కోట్లు, తుని మండలంలో 11,993 మందికి రూ.5.31 కోట్లు, జగ్గంపేటలో 11,775 మందికి రూ.5.26 కోట్ల పింఛను సొమ్ము పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.

# ఏపీ టెట్‌కు కాకినాడ జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు
**10,620 మంది అభ్యర్థులకు 5 పరీక్షా కేంద్రాలు : కలెక్టర్ హరేంధిర ప్రసాద్**



కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్)ను జిల్లాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆగస్టు 5 నుంచి 21 వరకు జరిగే టెట్ పరీక్షల ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 10,620 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానుండగా, కంప్యూటర్ ఆధారిత పరీక్షల కోసం ఐదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాకినాడ అచ్చుతాపురంలోని ఐయాన్ డిజిటల్ జోన్‌లో 4,300 మంది, రాయుడుపాలెం జంక్షన్‌లోని సాఫ్ట్ టెక్నాలజీస్‌లో 4,400 మంది, సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో 530 మంది, ఆదిత్య యూనివర్సిటీలో 540 మంది, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో 850 మంది పరీక్షలు రాయనున్నారని వెల్లడించారు. ప్రతిరోజూ రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని చెప్పారు. ప్రతి పరీక్షా కేంద్రంలో నిరంతర విద్యుత్ సరఫరా, ప్రతి కంప్యూటర్‌కు యూపీఎస్, ప్రత్యామ్నాయంగా జనరేటర్ తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమలు చేయడంతో పాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి శాంతిభద్రతలు కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు పరీక్షల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలకు మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని తెలిపారు. ప్రతి కేంద్రంలో ప్రథమ చికిత్స సదుపాయం, అంబులెన్స్ ఏర్పాటు చేయాలని వైద్యశాఖకు, అభ్యర్థుల రాకపోకలకు అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఒరిజినల్ గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని తెలిపారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి పిల్లి రమేష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో యనమల దివ్య



తుని, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రజా వాగ్ధానాలను నెలవేర్చడమే కాకుండా ప్రజాహితం కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందని ప్రభుత్వ విఫ్ యనమల దివ్య అన్నారు. 2ఏళ్ళ నమ్మకం అభివృద్ధి సంక్షేమం నినాదంతో కూటమి విజయాలను ప్రజలకు వివరిస్తూ తుని నియోజకవర్గంలో ఇంటింటా కార్యక్రమం జనప్రభంనంతో సాగుతుంది. ఇందులో భాగంగా ఇవాళ ప్రభుత్వ విఫ్ యనమల దివ్య కూటమి శ్రేణులతో కలిసి తుని పట్టణంలో కూటమి విజయాలపై ఇంటింటికీ వెళ్ళి చేసిన అభివృద్ధి వివరిస్తూ,ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.గతంలో మీ ఇంటికి వచ్చా మీ సమస్యలు తెలుసుకున్నా...మీ సమస్యకు పరిష్కార బాధ్యతతో పరిష్కరించానని వివరించిన ఎమ్మెల్యే శ్రీమతి యనమల దివ్యకు జేజేలు పలికిన ప్రజలు మా మంచి ఎమ్మెల్యే మా దివ్యమ్మ అంటూ నినాదాలు చేసారు. 15,27వార్డుల్లో ఇంటింటికీ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, సీనియర్ నేత యనమల రాజేష్ లతో విచ్చేసిన ఎమ్మెల్యే యనమల దివ్యకు జిల్లా టీడీపీ టౌన్ టీడీపీ అధ్యక్షురాలు కుసుమంచి శోభారాణి సత్యనారాయణ, గవర కార్పోరేషన్ డైరెక్టర్ మల్ల గణేష్,మోతుకూరి వెంకటేష్,కుక్కడపు బాలాజీ, పరవాడ తాతబాబు, చందక గురుమూర్తి, తదితరులు ఘనస్వాగతం పలికారు. తొలుత కొత్తపేట వినాయక ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్ళిన ఆమె వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వార్డుల్లో చేపట్టవల్సిన అభివృద్ధి పనులపై ఆరా తీసారు.

# రైతులకు ఉచిత బీమా పథకం అమలు చేయాలి
**ప్రీమియంను ప్రభుత్వమే భరించాలి : రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు డిమాండ్**




మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ : రాష్ట్రంలోని రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు డిమాండ్ చేశారు. రైతులకు ఉచిత బీమా పథకం అమలు చేసి ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించాలని, ధరల స్థిరీకరణ కోసం రూ.5 వేల కోట్లు కేటాయించాలని కోరారు. రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం గురువారం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రాష్ట్రంలోని రైతాంగ సమస్యలు, వ్యవసాయ పరిస్థితులు, ఎల్నినో ప్రభావం, పంటల రక్షణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించి పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా కామన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వరి, పత్తి వంటి పంటలు తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉందని, ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ప్రత్యామ్నాయంగా కంది, మినుములు, చిరుధాన్యాల వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలను ప్రోత్సహించాలని, జల వనరుల నిర్వహణ మెరుగుపరచాలని, బోర్‌వెల్ ఆధారిత రక్షణాత్మక సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సహజ వ్యవసాయ పద్ధతులు అవలంబించే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలు, ప్రత్యామ్నాయ విత్తనాలు అందించడంతో పాటు రాష్ట్రంలోని రైతులందరికీ ఉచిత పంట బీమా పథకం అమలు చేసి ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించాలని తీర్మానించారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో పశుగ్రాసం కొరత నివారణకు ప్రభుత్వం ఉచితంగా పశుగ్రాసం అందించాలని కోరారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో యూరియా, డీఏపీ ఎరువులను ఎలాంటి కొరత లేకుండా, యాప్‌ల అవసరం లేకుండా రైతులకు ఆర్బీకేల ద్వారా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. పీసీసీ వైస్ ప్రెసిడెంట్, అడ్మిన్ ఇన్‌చార్జి కొలనుకొండ శివాజీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రైతు సమస్యలపై కిసాన్ కాంగ్రెస్ మరింతగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు నాయకత్వాన్ని అభినందిస్తూ, రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఇటీవల దేశ రాజధానిలో విద్యార్థులు చేసిన ఉద్యమానికి భారత పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఉద్యమాన్ని అభినందిస్తూ రాహుల్ గాంధీ పాత్రను ఈ దేశ ప్రజలు గుర్తించారని, ఆయనను భావి ప్రధానిగా ప్రజలు నిర్ణయించుకున్నారని కొనియాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్లు, జిల్లా చైర్మన్లు, రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డిబి రోడ్డు పనులు
# వేగవంతం చేయాలి
రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ : నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఆర్ అండ్ బి ఉన్నతాధికారు లతోరాజానగరం నియోజ కవర్గం ఎమ్మెల్యే ఒక ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ప్రజలకు ర వాణా సౌకర్యాలు మెరు గుపరచడమే లక్ష్యంగా నిర్దేశిత గడువుల్లోగా అన్ని రోడ్డు పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా నియో జక వర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు ప్రధాన రహదారుల నిర్మాణాలపై ఆయన అధికారులకు దిశా నిర్దేశం చేశారు.కాపవరం - ముగ్గళ్ళ రోడ్డు ఈ రహదారి పనుల ను సెప్టెంబర్ నెల మొదటి వారం నాటికి అందు బాటు లోకి తేవాలి.చినకొండేపూడి చీపురుపల్లి రోడ్డు ఈ పనులన్నింటి నీ అక్టోబర్ మొదటి వారం నాటికి అన్ని విధాలుగా పూర్తి చేయాలి. రాబోయే పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పుష్కరాల నిధుల కింద చేపట్టే పనులను త్వరి తగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించా రు.రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిరంత రం పనులను పర్య వేక్షిస్తూ ప్రగతి నివేదికలను అందించాలని ఆర్ అండ్ బి అధికారులకు ఎమ్మెల్యే బ త్తుల బలరామ కృష్ణ తేల్చి చెప్పారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి శాఖకు చెంది న పలువురు అధికా రులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు
# 30%స్థానాల్లో బిజెపి పోటీ : పిక్కి



కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ : రానున్న స్థానిక సంస్థల్లో భారతీయ జనతా పార్టీ 30శాతం పోటీ చేస్తుందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర అన్నారు. గురువారం కోరుకొండ ఆదిత్య ఫంక్షన్ హాల్ లో రాజానగరం నియోజక భారతీయ జనతా పార్టీ నాయకుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో బిజెపి గతం కంటే మిన్నగా గల్లీ దాకా ఢిల్లీ దాకా ప్రజలలో మంచి ప్రాబల్యాన్ని పెంపొందించు కుందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి గ్రామంలో 12 మందితో కమిటీలు బలోపేతం చేశామన్నారు. కుమారి ప్రసంగి దేవి ఎన్డిఏ ఆధ్వర్యంలో బిజెపి 30% స్థానాల్లో తప్పక పోటీ చేస్తుందన్నారు. భాజపా కమిటీ సభ్యులు, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంగా పనిచేసే పోటీ చేసిన అభ్యర్థులను గెలిపించుకుంటారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆర్టికల్ 370, ఆపరేషన్ సింధూర్, రాముని చరిత్ర, దేశ రక్షణ రంగాన్ని బలోపేతం, దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకుపోవడం వంటి అంశాలను పాఠ్య పుస్తకాల్లో ప్రచురించడంతో కాంగ్రెస్, ఆఫ్ పార్టీల ఎన్నెలో వణుకు పుట్టిందన్నారు.ఈ అక్కస్సుతోనే బిజెపిపై కుట్రలు పన్నారన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు నీరు కొండ వీరన్న చౌదరి, ఏపీఆర్ చౌదరి, అడపా సుధీర్ కుమార్, పేపకాయల కాశి, మద్దిపాటి రజిని, ఎమ్మెస్సార్ కే రాజు, నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ ధరకు సన్న బియ్యం
**ఆగస్టు 1 నుంచి జిల్లాలో అమలు : జేసీ అపూర్వ భరత్**



కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ : బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలను నియంత్రించి పేద, మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యాన్ని అందుబాటు ధరలో అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మార్కెట్ ఇంటర్వెన్షన్ ప్రోగ్రామ్ (ఎంఐపీ)ను ఆగస్టు 1 నుంచి కాకినాడ జిల్లాలో అమలు చేయనున్నట్లు కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఐపీ కింద ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయిస్తామని తెలిపారు. సూపర్ ఫైన్ రైస్, స్టీమ్ (బీపీటీ) రైస్ కిలో రూ.52, రా (బీపీటీ) రైస్ కిలో రూ.50కు అందుబాటులో ఉంటాయని చెప్పారు. పంపిణీలో పారదర్శకత, సరుకు నాణ్యత, సరైన తూకాలు, నిర్ణీత ధరల అమలుపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని వెల్లడించారు. బియ్యం సేకరణ, రవాణా, పంపిణీ ప్రక్రియలను పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, రైస్ మిల్లర్లతో సమన్వయం చేస్తూ ఎలాంటి ఆటంకం లేకుండా నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని రైతు బజార్లు, ప్రత్యేక విక్రయ కేంద్రాలకు అవసరమైన సన్న బియ్యాన్ని నిరంతరం సరఫరా చేయాలని రైస్ మిల్లర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అధిక ధరలకు విక్రయించడం, నిల్వలను దుర్వినియోగం చేయడం, తూకాల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి రోజు విక్రయ కేంద్రాల వద్ద స్టాక్, అమ్మకాలు, వినియోగదారుల వివరాలను జిల్లా యంత్రాంగం పర్యవేక్షిస్తుందని, ప్రజలు ప్రభుత్వం గుర్తించిన అధికారిక విక్రయ కేంద్రాల నుంచే నిర్ణీత ధరలకు బియ్యం కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ కోరారు. సమావేశంలో డీఎస్‌వో (ఎఫ్ఏసీ) టి.ప్రసన్న లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మెగా డీఎస్సీపై దుష్ప్రచారం
# రుజువు చేస్తే రాజీనామా
**సున్నా స్థాయికి వైసీపీ పతనం : ఎమ్మెల్సీ పేరాబత్తుల**



కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ : కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియపై వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తుందని దానిని నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం కాకినాడ రూరల్ సర్పవరంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ డీఎస్సీ నియామకాల వ్యవహారంలో ఎలాంటి తప్పు జరగలేదని, ఒకవేళ లొసుగులు గానీ, అక్రమాలు గానీ జరిగినట్లు వైసీపీ నాయకులు నిరూపిస్తే తాను తక్షణమే తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడానికి సిద్ధమని బహిరంగ సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వానికి వస్తున్న మంచి పేరును చూసి ఓర్వలేకే ప్రతిపక్ష వైసీపీ నిందలు వేస్తున్నాయని మండిపడ్డారు. హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ఇచ్చిన హామీల అమలుకు పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఒకవేళ పొరపాట్లు జరిగితే నైతిక బాధ్యత వహించడానికి ప్రభుత్వం ఎప్పుడూ వెనుకాడదని పేర్కొన్నారు. ఇప్పటికే వైసీపీ ప్రజా విశ్వాసం కోల్పోయిందని డీఎస్సీ అంశం నుంచి సున్నా స్థాయికి గ్రాఫ్ పడిపోయిందని చెప్పారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా నెరవేరుస్తామని రాజశేఖర్ తెలిపారు.

సీతానగరం పిహెచ్‌సీని
# తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ



సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ : తూర్పుగోదావరి జిల్లా సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాజమహేంద్రవరం డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.వి. చలపతిరావు అకస్మిక సందర్శన చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవలు గురించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలలో అవగాహన కలిగించాలని, బాల్య వివాహాలు జరగకుండా చూడాలని, టీనేజ్ ప్రెగ్నెన్సీలు నివారించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు ఎక్కువగా చేయించాలని, సిజేరియన్ ఆపరేషన్ జరగకుండా సహజ ప్రసవాలు జరిగేటట్లు చూడాలని అన్నారు. వ్యాక్సిన్లు మరియు అత్యవసరం మందులు అందు బాటులో ఉంచుకోవాలని, పిహెచ్‌సి సిబ్బందిని ఆదేశించారు. ఈరోజు ప్రసవం జరిగిన వార్డులో ఉన్న తల్లి బిడ్డ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యాధికారిణి ఎం శైలజారాణి, ఎంపీహెచ్ ఈవోలు నాగు, వైయస్.రాయుడు, పిహెచ్‌ఎన్ కె.ఆదిలక్ష్మి, సూపర్వైజర్లు కె.సుధాకర్, ఎన్.అనురాధ, సీనియర్ అసిస్టెంట్ బాబ్జి,ఆసుపత్రి ఓ.పి సిబ్బంది పాల్గొన్నారు.

# టిడిపిలో చేరిన పలువురు వైసీపీ నాయకులు
**పార్టీ కండువా కప్పి సాధరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే వేగుళ్ళ**



కపిలేశ్వరపురం మండలం, విశ్వంవాయిస్ న్యూస్ : కపిలేశ్వరపురం మండలం, టేకి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు గుత్తుల శ్రీనివాస్, దాసి రాంజి అంబేద్కర్, మాజీ వార్డు మెంబరు గుండుపిల్లి సునీత, గుత్తుల బేబి సరోజిని లు గురువారం ఆ గ్రామ టీడీపీ నాయకులు దాసరి శ్రీను,మేడిశెట్టి శ్రీను గార్ల ఆధ్వర్యంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు సమక్షంలో వైసీపీ ని వీడి తెలుగుదేశంపార్టీలో చేరారు. పార్టీలోకి వచ్చిన వీరందరికీ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు టీడీపీ పసుపు కండువాలు కప్పి, పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పరిపాలనకు ఆకర్షితులై గ్రామ గ్రామాన నాయకులు, తటస్థులు టీడీపీ వైపు వస్తున్నారన్నారు. పార్టీని నమ్మి వచ్చిన ప్రతీ ఒక్కరికీ తగిన ప్రాధాన్యత లభిస్తుందన్నారు. గ్రామ ప్రగతికి, పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలి అని పిలుపునిచ్చారు.



దేశంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలిసారి

# పోలవరం జిల్లాలో ఆర్బీఎస్కే 2.0కు శ్రీకారం

- ★ 62.65 లక్షల మంది పిల్లలకు 38 రకాల ఉచిత ఆరోగ్య పరీక్షల నిర్వహణకు శ్రీకారం
- ★ రంపచోడవరం ముసురుమిల్లి పాఠశాలలో ఆర్బీఎస్కే 2.0 రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన మంత్రి సత్య కుమార్
- ★ తొలిసారిగా బీపీ, షుగర్, ఇతర పరీక్షలతో పాటు సెల్ ఫోన్ వినియోగం వివరాల సేకరిస్తున్నామని మంత్రి శ్రీ సత్యకుమార్ వెల్లడి
- ★ పరీక్షల ద్వారా ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి చిన్నారులకు ఉచిత వైద్యం అందిస్తామని స్పష్టీకరణ
- ★ 43.30 లక్షల మంది చిన్నారులకు కళ్ళజోళ్లు అందజేస్తామని వెల్లడి
- ★ 2.50 లక్షల మందికి ఉచిత కళ్లజోళ్లు అందజేస్తామని వెల్లడి ★ కలెక్టర్ దినేష్ కుమార్ పరిపాలన సామర్థ్యం గురించి అభినందించిన మంత్రి సత్య కుమార్

**రంపచోడవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** చిన్నారుల్లో ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైన చికిత్సను ఉచితంగా అందించేందుకు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం కింద సమగ్ర ఆరోగ్య పరీక్షలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పోలవరం జిల్లా రంపచోడవరంలోని ముసురుమిల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి ఆరోగ్య పరీక్షల ప్రారంభ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ గురువారం ఉదయం ప్రారంభించారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించి విద్యార్థులతో వారి ఆరోగ్య పరిస్థితుల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పాఠశాలల వరకు ఉన్న ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణించగలరని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోగలరని పేర్కొన్నారు. అందుకే పిల్లలకు అనారోగ్యం వచ్చిన తర్వాత వైద్యం చేయడం మాత్రమే కాకుండా, సమస్యలను ముందుగానే గుర్తించి నివారించే విధానానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే ఈ కార్యక్రమాన్ని గిరిజన పిల్లలు అధికంగా ఉన్న రంపచోడవరం ప్రాంతం నుంచి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్య సేవలే ప్రజలకు ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న వైద్యుల ఖాళీలను భర్తీ చేసే దిశగా కేవలం మూడు నెలల్లో 12 మంది వైద్యులను కేటాయించడం వల్ల పీహెచ్‌సీలలో వైద్య సేవలు మెరుగుపడ్డాయని చెప్పారు. నిర్మాణంలో ఉన్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ ఏడాది రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం-2.0 కింద 62,65,410 మంది చిన్నారులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. వీరిలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఆరేళ్లలోపు చిన్నారులు 20,95,129 మంది, ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ పాఠశాలల్లో చదువుతున్న ఆరు నుంచి 18 ఏళ్ల వయసు వారు 41,70,281 మంది ఉన్నారని వివరించారు.

**మారిన జీవనశైలికి అనుగుణంగా చిన్నారులకు పరీక్షలు**

పుట్టుకతో వచ్చే లోపాలు, వివిధ వ్యాధులు, పోషకాహార లోపాలు, శారీరక-మానసిక



ఎదుగుదలలో ఆలస్యం సహా 38 రకాల ఆరోగ్య సమస్యలను ఈ పరీక్షల్లో గుర్తిస్తామన్నారు. జీవనశైలి విధానంలో వస్తున్న మార్పులకు తగ్గట్లు గతంలో ఉన్న పరీక్షలకు ఆదనంగా చిన్నారులకు అధిక రక్తపోటు, మధుమేహం, ఊబకాయం, మూత్రపిండాలు-మూత్రనాళ సమస్యలు, మానసిక ఇబ్బందులు, అధిక చరవాణి (సెల్ ఫోన్) వినియోగం, నిద్రకు సంబంధించిన సమస్యలపైనా దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. పిల్లల్లో సమస్యను ఎంత త్వరగా గుర్తిస్తే అంత సులభంగా చికిత్స చేయవచ్చని మంత్రి పేర్కొన్నారు. పుట్టుకతో వచ్చే గుండె సమస్యలు, పెదవి-అంగిలి చీలిక, కాళ్లలో పుట్టుకతో వచ్చే లోపాలు, నాడీ సంబంధిత సమస్యలు వంటివి చిన్న వయసులోనే గుర్తించి వైద్యం అందిస్తే భవిష్యత్తులో అంగవైకల్యం సహా అనేక సమస్యలను నివారించవచ్చన్నారు.

**గుర్తింపుతో ఆగకుండా చికిత్స వరకు...!**

ఆరోగ్య పరీక్షల్లో సమస్య బయటపడిన చిన్నారులను సమీప ప్రభుత్వ ఆసుపత్రులు, జిల్లా స్థాయి చిన్నారుల చికిత్స కేంద్రాలు, అవసరమైతే ఉన్నత వైద్య సంస్థలకు పంపించి ఉచితంగా చికిత్స అందిస్తున్నామని మంత్రి తెలిపారు. వ్యాధిని గుర్తించి పంపించడంతో బాధ్యత ముగిసినట్లు భావించకుండా, చికిత్స పూర్తయ్యే వరకు ప్రతి చిన్నారినీ పర్యవేక్షించాలనే స్పష్టమైన విధానంతో ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. రాష్ట్రంలో ఇందుకోసం 34 జిల్లా స్థాయి చిన్నారుల చికిత్స కేంద్రాలు పనిచేస్తున్నాయని, గత రెండేళ్లలో వీటి ద్వారా దాదాపు 4.85 లక్షల మంది చిన్నారులకు వైద్య సేవలు అందాయని చెప్పారు. చికిత్స అవసరమైన పిల్లలను ఆసుపత్రులకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక వాహన సదుపాయం కూడా కల్పిస్తున్నామన్నారు. గత రెండేళ్లలో బాల ఆరోగ్య కార్యక్రమం కింద 3,214 శస్త్రచికిత్సలు నిర్వహించామని, శస్త్రచికిత్సలు, నులిపురుగుల నివారణ, క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది సేవలు తదితరాల కోసం కలిపి సుమారు రూ.25.78 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి వెల్లడించారు.

**43.30 లక్షల మందికి కంటి పరీక్షలు**

పిల్లల్లో చూపు సమస్యలను కూడా ముందుగానే గుర్తించేందుకు ఈ ఏడాది ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 43.30 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. వారిలో చూపు సమస్యలున్న వారిని గుర్తించి అవసరమైన చికిత్సతో పాటు 2.50 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లజోళ్లు అందించనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.7 కోట్లు కేటాయించిందన్నారు. తమకు చూపు సరిగా లేదనే విషయాన్ని చాలామంది పిల్లలు బయటకు చెప్పుకోలేరని మంత్రి పేర్కొన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు బోర్డుపై రాసినది కనిపించకపోవడంతో చదువులో వెనుకబడే పరిస్థితి ఏర్పడవచ్చన్నారు. అలాంటి పిల్లలను చదువులో బలహీనులుగా భావించే అవకాశం కూడా ఉంటుందని చెప్పారు. అందుకే పాఠశాలకే వైద్య బృందాలను పంపించి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లజోళ్లు అందించడం ద్వారా చదువుకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కిశోర దశలో పిల్లలు శారీరక మార్పులతో పాటు మానసికంగా అనేక సమస్యలను ఎదుర్కొంటారని మంత్రి తెలిపారు. కొన్ని విషయాలను తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు చెప్పేందుకు సంకోచిస్తారని, సమస్యలను లోలోపలే దాచుకోవడం వల్ల తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. అటువంటి పరిస్థితుల్లో వారికి దగ్గరగా ఉండే తోటి విద్యార్థులే మొదటి భరోసాగా నిలవాలనే ఉద్దేశంతో రాష్ట్రీయ కిశోర స్వాస్థ్య కార్యక్రమాన్ని బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,317 కిశోర మైత్రి ఆరోగ్య కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, 61,556 మంది తోటి విద్యార్థి మార్గదర్శకులను సిద్ధం చేశామని తెలిపారు. ముఖ్యంగా కిశోర బాలికలు రుతుస్రావం, వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత, ఇతర ఆరోగ్య సమస్యల గురించి మాట్లాడేందుకు సంకోచించకూడదన్నారు. మానసిక సమస్యలను కూడా సాధారణ ఆరోగ్య సమస్యల మాదిరిగానే చూడాలని, ఎవరేమనుకుంటారోననే భయంతో వాటిని దాచుకోవద్దని విద్యార్థులకు మంత్రి సూచించారు.

**పిల్లల ఆరోగ్యమే రాష్ట్ర భవిష్యత్తు**

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పిల్లల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు. "పిల్లల ఆరోగ్యమే వారి చదువుకు, కుటుంబాల ఆనందానికి, రాష్ట్ర భవిష్యత్తుకు పునాది. ఏ చిన్నారి కూడా ఆరోగ్య సమస్య కారణంగా చదువుకు, ఎదుగుదలకు దూరం కాకూడదు. పరీక్షలో సమస్య గుర్తించిన ప్రతి చిన్నారికి పూర్తిస్థాయి వైద్యం అందే వరకు ఆరోగ్య శాఖ బాధ్యత తీసుకోవాలి" అని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ జీరో వేకెన్సీ పాలసీ వల్ల పోలవరం పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అవసరాలకు తగ్గట్టుగా అందుబాటులోకి వచ్చారని చెప్పారు. గిరిజనులకు వైద్య సేవలు మెరుగుపరుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పద్మావతి, జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ జె.విజయలక్ష్మి, పోలవరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పి.సరిత, శాసనసభ సభ్యురాలు మిరియాల శిరీష, ఎస్టీ కమిషన్ చైర్మన్ సొళ్ళ బొజ్జి రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిని

## పరామర్శించిన ఢిల్లీ బాబు



**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేవీపట్నం మండల భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధ్యక్షుడు కారంరామన్న దొర గత కొన్ని రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారం సీతారామన్న దొర (ఢిల్లీ బాబు) పెనికిలపాడు గ్రామంలో గల ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా సీతారామన్న దొర ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రామన్న దొరకు అందుతున్న వైద్య సహాయం గురించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అధైర్యపడవద్దని, పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రామన్న దొర త్వరగా కోలుకుని, మళ్లీ ప్రజా సేవలో చురుగ్గా పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, మండల ప్రధాన కార్యదర్శి అయినాల వెంకటేశ్వర్రాస్త్రవు జిల్లా కార్యదర్శి పడమటి లక్ష్మణరావు, జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు చిర్రా చిట్టిబాబు, శానంపూడి సూర్యరావు బిజెపి యువమోర్చా నాయకులు అయినాల నారాయణ, తెల్లం శేఖర్, జిల్లా మీడియా కన్వీనర్ బొంతు చక్రి, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయవరం ఎంపీడీవో కార్యాలయంలో

## నేడు ఉచిత వైద్య శిబిరం



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రాయవరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటన ద్వారా తెలిపారు. ఈ వైద్య శిబిరంలో రాజమహేంద్రవరానికి చెందిన గౌతమీ నేత్రాలయం, నీరజ డయాబెటీస్ ఆసుపత్రి, శ్రీ రమా దంత వైద్యశాలలకు చెందిన నిపుణులైన వైద్యులు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో రక్తపోటు (బీపీ), రక్తంలో చక్కెర (షుగర్) పరీక్షలు, కంటి పరీక్షలు, దంత పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారు. ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, అర్హులైన కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. అలాగే, ఆరోగ్య కార్డు (ఈహెచ్‌ఎస్) కలిగిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఈహెచ్‌ఎస్ పథకం ద్వారా అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

22 (ఏ)భూముల నిర్లక్ష్యం

## దేవాదాయ, రెవెన్యూశాఖ మంత్రులదే బాధ్యత

- రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ మారిశెట్టి
- రెవిన్యూ దేవాదాయశాఖ తీరుపై రైతులు ఆగ్రహం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా సుమారు రెండు లక్షలఎకరాల జిరాయితీ భూములను రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా 22(ఏ)లో పెట్టి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఈ పరిణామాలకు రాష్ట్ర రెవెన్యూ, దేవాదాయశాఖ మంత్రులదే అని మాజీ డిప్యూటీ కలెక్టర్ మారిశెట్టి జితేంద్ర తెలిపారు. గురువారం కోరుకొండ గ్రామానికి చెందిన కోసూరి శ్రీనుకు సంబంధించిన భూమి 22(ఏ) నుండి విముక్తి కలిగినందుకు, కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీ నరసింహస్వామికి 101 టెంకాయ కొట్టి, మిగిలిన రైతుల భూములు కూడా విముక్తి కలగాలని ప్రార్థించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ డిప్యూటీ కలెక్టర్ మారిశెట్టి జితేంద్ర విచ్చేసి, రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, దేవాదాయశాఖ అధికారుల నిర్లక్ష్యంగా రెండేళ్లుగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాం తనను తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ రెవెన్యూశాఖ అధికారులు తమకు సంబంధం లేని రైతుల జిరాయితి భూములను రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల ఎకరాలు 22 (ఏ)లో పెట్టి, రెండు ఏళ్ల నుండి రైతులను తీవ్ర ఇబ్బందులను గురి చేస్తున్నారన్నారు. దీనిపై రైతుల తరఫున రెవెన్యూశాఖలో నాలుగు కేసులు, దేవాదాయ శాఖపై రెండు కేసులు లోకాయుక్తలో నడుస్తున్నాయన్నారు. అదేవిధంగా కోరుకొండలోని 259 ఎకరాలను 22 (ఏ) నుండి తొలగించడానికి రెవెన్యూ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వ్యక్తం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ, దేవాదాయశాఖ మంత్రులు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి భూములుపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, రైతులకు న్యాయం చేయాలని లేని పక్షంలో ఈ ఉద్యమం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రతరం అవుతుందని, రాబోయే స్థానిక ఎన్నికలను ఈ ప్రభావం ఎన్డీఏ ప్రభుత్వం పై ఉంటుందని రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇసుకపల్లి రాజారావు, ఉప్పలపాటి రామస్వామి, మద్దాల రమణ, కోడి నాగుల వెంకటేశ్వరరావు, నెక్కంటి మురళి, తనకాల బలరాముడు, కోడినాగుల ప్రసాద్, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

కాపు కార్పొరేషన్ అధ్యక్షులు కొత్తపల్లిని


## మర్యాద పూర్వకంగా కలిసిన గంగిశెట్టి



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర కాపు కార్పొరేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి సుబ్బారాయుడిని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గంగిశెట్టి చంటిబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం విజయవాడలో కాపు కార్పొరేషన్ అధ్యక్షులు కొత్తపల్లి సుబ్బారాయుడుని, గంగిశెట్టి మర్యాద పూర్వకంగా కలిసి పూలమాల వేసి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గంగిశెట్టి చంటిబాబు, సంగుల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైబర్ నేరాలు పట్ల

## అవగాహన కలిగి ఉండాలి : డీఎస్పీ బి.విద్య



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో గురువారం విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డీఎస్పీ బి విద్య ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ మోసాల నివారణ, యువతకు కెరీర్ గైడెన్స్, డ్రగ్స్ నిర్మూలనతో పాటు పోక్సో చట్టం గురించి వివరంగా అవగాహన కల్పించారు. సైబర్ నేరాల నుంచి ఎలా అప్రమత్తంగా ఉండాలి, ఆన్‌లైన్ మోసాలను ఎలా గుర్తించి నివారించాలి, మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, బాలల రక్షణకు సంబంధించిన చట్టాల ప్రాముఖ్యత గురించి ఆమె విద్యార్థులకు సూచనలు చేశారు. అలాగే విద్యార్థులు తమ భవిష్యత్ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకోవాలని, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని మండపేట టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.సురేష్ పోలీస్ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీవీ శ్రీనివాస్, అధ్యాపకులు సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



### అలాంటి పాత్రలో కనిపించడం

# కేవలం ఎన్టీఆర్‌కే సాధ్యం..

### మరో హీరో చేయలేరు.. కోన వెంకట్..




రచయిత కోన వెంకట్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ జూనియర్ ఎన్టీఆర్ ఓ సినిమాలో చేసిన పాత్రకు ప్రత్యేక నటనను ప్రశంసించారు. పూరి జగన్నాథ్ ఆలోచనా విధానాన్ని, అమ్మా నాన్న ఓ తమిళ అమ్మాయి వంటి సినిమాల పుట్టుకను వివరించారు. అలాగే పూరి తన కమ్‌బ్యాక్‌కు సిద్ధంగా ఉన్నారని, ఆయన ఒక తత్వవేత్త అని అన్నారు. ప్రస్తుతం ఆయన చేసిన కామెంట్స్ వైరలవుతున్నాయి. రచయిత కోన వెంకట్ జూనియర్ ఎన్టీఆర్ నటనలోని ప్రత్యేకతను, దర్శకుడు పూరి జగన్నాథ్ ఆలోచనా విధానాన్ని చెప్పుకొస్తూ ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. అదుర్స్ చిత్రం కోసం జూనియర్ ఎన్టీఆర్ ఒక పౌరోహిత్య పాత్రను పోషిస్తే ఎలా ఉంటుందో తాను ఊహించుకున్నానని కోన వెంకట్ వెల్లడించారు. “ఎన్టీఆర్ లాంటి ఓ హీరో ఒక పిలక వేసుకుని, ఒక స్వచ్ఛమైన బ్రాహ్మణ పాత్ర చేస్తే భలే భలే ఉంటది,” అని తాను అనుకున్నట్లు తెలిపారు. ఎందుకంటే జూనియర్ ఎన్టీఆర్ ఉచ్చారణ, మాడ్యులేషన్ చాలా బాగుంటాయని, ఆయన మాటలను నమలేయకుండా స్పష్టంగా పలకడం ఆ పాత్రకు ప్రాణం పోస్తుందని వివరించారు. అదుర్స్ చిత్రంలో “ఏమిటే భామ్మా?” వంటి సంభాషణలను ఉటంకిస్తూ, ఆ మాడ్యులేషన్ తో కూడిన డైలాగులు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయని, అలాంటి ప్రత్యేకమైన క్యారెక్టర్‌ను దృష్టిలో పెట్టుకుని అదుర్స్ చిత్రాన్ని రూపొందించడం జరిగిందని కోన వెంకట్ పేర్కొన్నారు. 100% తెలుగు సినీ పరిశ్రమలో మరెవరూ చేయలేని పాత్ర అది అని ఆయన ధీమాగా చెప్పారు. అదే విధంగా, పూరి జగన్నాథ్ దర్శకత్వం గురించి మాట్లాడుతూ, అమ్మా నాన్న ఓ తమిళ అమ్మాయి వంటి గొప్ప కథలు పూరికి ఒక క్షణంలో పుట్టిన ఆలోచనల నుండి రూపుదిద్దుకున్నాయని వివరించారు. అలాంటి కథలు ఇప్పుడు ఎందుకు రావట్లేదని ప్రశ్నించగా, ఒక ఆలోచన పుట్టడం, అది కథగా మారడం, అందరూ కలిసి దాన్ని గొప్ప సినిమాగా తీర్చిదిద్దడం జరుగుతుందని, ఆ సినిమా ఎంతో మందిని ప్రభావితం చేసి ఒక జ్ఞాపకంగా మిగిలిపోతుందని అన్నారు. పూరి కమ్‌బ్యాక్ చాలా పెద్దదిగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. “ఆలోచనలకి వయసు ఉండదు,” అని చెబుతూ, పూరి ఆలోచనా విధానంలో, బ్రెయిన్‌లో ఎటువంటి మార్పు లేదని చెప్పారు. అయితే, మిస్టేక్ ఎక్కడ జరుగుతుందంటే, కొన్నిసార్లు తప్పుడు కంటెంట్‌ను నమ్మడం వల్ల, లేదా ఒక కథ టేక్-ఆఫ్ బాగున్నా, ల్యాండింగ్ సరిగ్గా లేకపోతే మిస్-ఫైర్ అయ్యే అవకాశాలు ఉంటాయని వివరించారు. పోకిరి వంటి చిత్రాలు అద్భుతమైన ల్యాండింగ్‌కు నిదర్శనమని తెలిపారు.

# హిట్లు కొట్టినా పట్టించుకోవడం లేదే..!

### అవకాశాల కోసం ఎదురుచూస్తున్న కేథరిన్ థ్రెసా

సినీ వాయిస్ CINE VOICE



మోడల్‌గా కెరీర్ మొదలు పెట్టి ఆతర్వాత హీరోయిన్ అయింది అందాల ముద్దుగుమ్మ కేథరిన్ థ్రెసా. హీరోయిన్‌గా కెరీర్ మొదలు పెట్టి తొలి సినిమాతోనే మంచి హిట్ అందుకుంది. ఆ తర్వాత వరుసగా సినిమాలు చేసి మెప్పించింది ఈ అమ్మడు.. మోడల్‌గా కెరీర్ మొదలు పెట్టి ఆతర్వాత హీరోయిన్ అయింది అందాల ముద్దుగుమ్మ కేథరిన్ థ్రెసా. హీరోయిన్‌గా కెరీర్ మొదలు పెట్టి తొలి సినిమాతోనే మంచి హిట్ అందుకుంది. ఆ తర్వాత వరుసగా సినిమాలు చేసి మెప్పించింది ఈ అమ్మడు.. పూరీజగనాద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఇద్దరమ్మాయిలతో అనే సినిమాతో టాలీవుడ్‌కు పరిచయం అయ్యింది.ఈ సినిమాలో అల్లు అర్జున్ సరసన నటించి ఆకట్టుకుంది. తొలి సినిమాలో గ్లామరస్‌గా కనిపించి మెప్పించింది కేథరిన్ థ్రెసా. సినిమా డిజాస్టర్ అయినా ఈ ముద్దుగుమ్మ గ్లామర్ కు మంచి మార్కులు పడ్డాయి.. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసి మెప్పించింది. కానీ సాలిడ్ సక్సెస్ మాత్రం అందుకోలేకపోయింది ఈ చిన్నది. స్టార్ హీరోల సినిమాల్లో నటించిన హిట్స్ పడలేదు. అదే క్రమంలో ఆచితూచి సినిమాలు ఎంచుకుంటూ వచ్చింది. మెయిన్ హీరోయిన్ గానే కాదు సెకండ్ హీరోయిన్ గానూ సినిమాలు చేసింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సరైనోడు సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈ సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా నటించింది. అలాగే రానా నేనే రాజు నేనే మంత్రి సినిమాలోనూ సెకండ్ హీరోయిన్‌గా కీలక పాత్రలో మెరిసింది. ఇక కళ్యాణ్ రామ్ నటించిన బింబిసార సినిమాతో భారీ హిట్ ఖాతాలో వేసుకుంది. ఈ సినిమాలో కూడా ఇద్దరు హీరోయిన్స్ నటించారు. ఇలా చాలా వరకు సెకండ్ హీరోయిన్ గానే మెప్పించింది కేథరిన్ థ్రెసా. వీటితోపాటే .. చిరంజీవి రవితేజ నటించిన వాల్తేరు వీరయ్య సినిమాల్లో నటించి ఆకట్టుకుంది. ఈ సినిమాలో రవితేజ సరసన నటించింది. ఈ సినిమాలన్నీ మంచి విజయాలను అందుకున్నాయి. మెయిన్ హీరోయిన్ గానే కాదు, సెకండ్ హీరోయిన్ గానూ నటించి ఆకట్టుకుంది ఈ అందాల భామ. వరుసగా హిట్స్ అందుకుంటుంది కానీ మెయిన్ హీరోయిన్ గా అనుకున్నంతగా గుర్తింపు మాత్రం తెచ్చుకోలేకపోతుంది ఈ బ్యూటీ. ఇక ఇటీవలే మన శంకర వరప్రసాద్ గారు అనే సినిమాలో నటించింది. ఈ సినిమాలో చిరంజీవి అసిస్టెంట్ గా కనిపించింది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. అయినా కూడా కేథరిన్ థ్రెసాకు ఆశించిన స్థాయిలో అవకాశాలు రావడం లేదు. సినిమాలతోనే కాదు సోషల్ మీడియాలోనూ ఈ బ్యూటీ తన అందాలతో అదరగొడుతుంది. తన గ్లామరస్ ఫొటోలతో కుర్రకారు మతిపోగొడుతోంది ఈ ముద్దుగుమ్మ.




## 92 ఏళ్ల హిస్టరీలో తొలిసారి..

### కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ అరుదైన రికార్డ్..!



గ్లాస్గో వేదికగా జరుగుతున్న ఈ క్రీడల్లో భారత బాక్సర్లు కనీసం 10 కాంస్యాలు సాధించడం ఖాయం అయింది. శుక్రవారం, శనివారం జరగనున్న సెమీస్, ఫైనల్స్ మ్యాచ్‌లలో సత్తా చాటి ఈ పతకాల రంగును బంగారంగా మార్చాలని భారత అభిమానులు బలంగా కోరుకుంటున్నారు. స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్-2026లో భారత బాక్సర్లు అదరగొడుతున్నారు. తమ పంచులతో ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తూ ఏకంగా 10 పతకాలను ఖాయం చేసుకుని చరిత్ర సృష్టించారు. 1934లో తొలిసారి కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొన్నప్పటి నుంచి బాక్సింగ్‌లో భారత్ ఇన్ని పతకాలు నెగ్గడం ఇదే తొలిసారి కావడం విశేషం. కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత క్రీడాకారులు అద్భుతమైన ప్రదర్శన చేస్తున్నారు. ఇప్పటికే భారత్ 22 పతకాలను ఖాయం చేసుకోగా, అందులో 10 పతకాలు బాక్సింగ్ విభాగం నుంచే రావడం విశేషం. ఏకంగా పది మంది భారతీయ బాక్సర్లు సెమీఫైనల్స్‌కు చేరుకున్నారు. బాక్సింగ్ నిబంధనల ప్రకారం సెమీస్ చేరిన ప్రతి అథ్లెట్‌కు కనీసం కాంస్య పతకం వస్తుంది. కాబట్టి 10 మందికి కాంస్యాలు ఖాయం అయ్యాయి. గతంలో 2018 గోల్డ్ కోస్ట్ గేమ్స్‌లో 9 పతకాలు సాధించడమే ఇప్పటివరకు అత్యుత్తమ ప్రదర్శన. 2022 బర్మింగ్‌హామ్‌లో 7 పతకాలు దక్కాయి. ఇప్పుడు ఆ రికార్డులన్నీ బద్దలు కొడుతూ 10 పతకాలతో భారత బాక్సర్లు కొత్త చరిత్ర లిఖించారు.

**అదరగొట్టిన మహిళా బాక్సర్లు..**

ముందుగా లవ్లీనా బోర్గోహైన్ (75 కేజీలు) బై ద్వారా నేరుగా సెమీస్‌కు అర్హత సాధించి భారత్‌కు తొలి పతకాన్ని ఖాయం చేసింది. ఆ తర్వాత 54 కేజీల విభాగంలో ప్రీతి పవార్ నార్తర్న్ ఐర్లాండ్‌కు చెందిన ప్రత్యర్థిని తన కళ్లు చెదిరే పంచులతో మట్టికరిపించి రెండో పతకం ఖాయం చేసింది. 60 కేజీల విభాగంలో ప్రియా ఘంఘాస్ కూడా అద్భుతంగా ఆడి సెమీస్‌కు చేరింది. తాజాగా జులై 29, బుధవారం నాడు ఒక్కరోజే ఆరుగురు భారత బాక్సర్లు సెమీస్ చేరి అదుర్స్ అనిపించారు. 51 కేజీల విభాగంలో బరిలోకి దిగిన సాక్షి చౌదరి నార్తర్న్ ఐర్లాండ్‌కు చెందిన కైట్లిన్ ఫ్రైయర్స్‌పై 5-0 తేడాతో ఏకపక్ష విజయం సాధించింది. తన ఎత్తును, రీచ్ అడ్వాంటేజ్ ను పర్ఫెక్ట్‌గా వాడుకుంటూ ప్రత్యర్థిని దరిచేరనివ్వలేదు. 70 కేజీల విభాగంలో అరుంధతి చౌదరి.. న్యూజిలాండ్ కు చెందిన మోర్గాన్ హెండర్సన్‌పై 3-1 తో నెగ్గి సెమీస్ బెర్త్ దక్కించుకుంది. మరో సంచలనం జాస్మిన్ లాంబోరియా 57 కేజీల విభాగంలో ఇంగ్లాండ్ కి చెందిన ఎలీస్ గ్లిన్‌ను 4-1తో చిత్తు చేసి పతకాన్ని ఖాయం చేసుకుంది.

# లంక సిరీస్‌కు ఐపీఎల్ అట్టర్ ఫ్లాప్..

### అలా ఎలా ఎంపిక చేస్తారంటూ మాజీ ప్లేయర్ ఫైర్..!



భారత్ - శ్రీలంక టెస్ట్ సిరీస్ కోసం బీసీసీఐ జట్టును ప్రకటించగా, రిషబ్ పంత్ ఎంపిక అందరినీ ఆశ్చర్యపరిచింది. ఓ ప్లేయర్ ఫిట్‌నెస్, ఐపీఎల్ ప్రదర్శనపై ఏబీ డివిలియర్స్ ప్రశ్నలు లేవనెత్తాడు. ఆ ప్లేయర్ ఎవరు, ఏబీడీ ఎందుకు ఆరోపణలు గుప్పించాడో ఇప్పుడు తెలుసుకుందాం.. భారత్, శ్రీలంకల మధ్య రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ వచ్చే నెల, అంటే ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానుంది. ఈ సిరీస్ కోసం బీసీసీఐ తన జట్టును కూడా ప్రకటించింది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ దృష్ట్యా టీమ్ ఇండియాకు ఈ సిరీస్ గెలవడం చాలా అవసరం. అందుకే బీసీసీఐ బలమైన జట్టును ఎంపిక చేసింది. అయితే, ఈ జట్టులో ఎంపికైన ఏకైక ఆటగాడి గురించి ఏబీ డి విలియర్స్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. శ్రీలంక పర్యటనకు భారత జట్టులో వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్ ఎంపికయ్యాడు. చాలా కాలం తర్వాత పంత్ జట్టులోకి తిరిగి వచ్చాడు. జట్టులోకి తిరిగి రాకముందు, పంత్ ఐపీఎల్‌లో అంతగా రాణించలేదు. ఈ నేపథ్యంలో అతని ఎంపికపై చాలామంది ప్రశ్నలు లేవనెత్తారు. ఈ గందరగోళం మధ్య, రిషబ్ పంత్ ఎంపిక గురించి మాట్లాడుతూ డి విలియర్స్ మాట్లాడుతూ, “పంత్‌ను జట్టుకు ఎంపిక చేయడం ఆశ్చర్యంగా ఉంది. అతని ఫిట్‌నెస్ ఎలా ఉందో చూడాలి. ఐపీఎల్ సమయంలో అతనిలో శక్తి, ఆత్మవిశ్వాసం చాలా తక్కువగా ఉన్నాయి.” ఇప్పుడు అతను మళ్లీ భారతదేశానికి ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ పర్యటనలో పంత్ తన అత్యుత్తమ ప్రదర్శన ఇస్తాడని ఆశిస్తున్నాను. నేను అతనికి పెద్ద అభిమానిని, అతను తన పూర్తి సామర్థ్యంతో ఆడటం చూడాలనుకుంటున్నాను,” అని ఆయన అన్నారు. కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్ విజయం గురించి మాట్లాడుతూ, ‘కొన్నిసార్లు విరామం తీసుకుని విశ్రాంతి తీసుకోవడం మంచిది. అది మిమ్మల్ని పునరుత్తేజ పరుస్తుంది. కానీ అదే సమయంలో, జట్టు ఆటగాళ్లు వేరొకరి (లక్ష్మణ్) సమక్షంలో రాణిస్తూ, ఆటను ఆస్వాదిస్తున్నారు. దీని వెనుక ఖచ్చితంగా ఏముందో నేను చెప్పలేను, కానీ వీవీఎస్ లక్ష్మణ్ ఖచ్చితంగా గౌతమ్ గంభీర్‌పై ఒత్తిడి పెడుతున్నారు’.

## కాషాయం రంగులోకి జెర్సీ.. విమర్శలపై స్పందించిన హాకీ ఇండియా



మరికొద్ది రోజుల్లో పురుషుల హాకీ ప్రపంచ కప్ జరగనుంది. ఈ టోర్నీకి బెల్జియం, నెదర్లాండ్స్ సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. ఈ క్రమంలోనే వరల్డ్ కప్‌నకు ముందు భారత పురుషుల, మహిళల జాతీయ జట్ల జెర్సీని నీలం నుంచి కాషాయం రంగులోకి మార్చడం వివాదాస్పదమైంది. దీనిపై విమర్శలు రావడంతో జెర్సీ రంగును ఎందుకు మార్చాల్సి వచ్చిందో హాకీ ఇండియా వివరణ ఇచ్చింది. బ్లూ సింథటిక్ మైదానంలో ఆటగాళ్లు బాగా కనిపించేందుకే జెర్సీ రంగును మార్చినట్లు స్పష్టతనిచ్చింది. “ఆటగాళ్లు, సహాయక సిబ్బందితో సమగ్రంగా చర్చించిన తర్వాతే జెర్సీ రంగును మార్చాం. దీని వెనుక ప్రధానమైన సాంకేతిక కారణం ఉంది. అంతర్జాతీయ హాకీ పిచ్‌లకు ప్రస్తుతం ప్రామాణికంగా ఉన్న బ్లూ సింథటిక్ ఉపరితలంతో మన ఆటగాళ్ల బ్లూ జెర్సీ కలిసిపోయినట్లుగా ఉంది. దీంతో మైదానంలో ఆటగాళ్లు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో కోచ్‌లు, ప్లేయర్లు పసుపు లేదా కాషాయం వంటి ప్రత్యామ్నాయ రంగులను సూచించారు. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత కాషాయం రంగును ఫైనల్ చేశాం. మన జాతీయ పతాకంలోని రంగులలో ఒకటైన కాషాయం.. ధైర్యం, త్యాగం, జాతీయ గౌరవానికి ప్రతీక. అందుకే దీన్ని ఎంచుకున్నాం. సాంకేతికంగానూ ఇది ఉత్తమంగా అనిపించింది” అని హాకీ ఇండియా పేర్కొంది. భారత హాకీ జట్టు జెర్సీ రంగులను మార్చడం కొత్తేమీ కాదని తెలిపింది. 2014 ప్రపంచ కప్ సమయంలో పసుపు రంగులోకి, 2018 వరల్డ్ కప్ వేళ స్కై బ్లూలోకి మార్చిన విషయాన్ని గుర్తు చేసింది. ఈ ఏడాది పురుషుల హాకీ ప్రపంచ కప్ ఆగస్టు 15 నుంచి 30 వరకు జరగనుంది. పూల్ డిలో ఉన్న భారత్ ఆగస్టు 15న వేల్స్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది. 17న ఇంగ్లాండ్‌తో, 19న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది. చివరగా 2023లో జరిగిన వరల్డ్ కప్‌లో భారత్ తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఈ టోర్నీలో భారత జట్టు ఒక్కసారి మాత్రమే ఛాంపియన్‌గా నిలిచింది. 1975లో పాక్‌ను ఓడించి విజేతగా అవతరించింది. తర్వాత ఒక్క పతకం కూడా సాధించలేదు. అంతకుముందు 1971లో కాంస్యం, 1973లో రజతం దక్కాయి.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com